TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:34 SATURDAY ,JUNE 13,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 34 శనివారం 13 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-

## వాళ్లకు ఎలాంటి విజన్ లేదు... పాయిజన్ మైండ్!

# తిరుపతి సభలో చంద్రబాబు



హంసకలం వార్త:
తిరుపతి వేదికగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి (ఎన్డీఏ) ప్రభుత్వం 'రెండేళ్ల నమ్మకం– అభివృద్ధి, సంక్షేమం' పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించింది. ఈ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు కింజరపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎన్డీఏ కూటమి నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ ప్రసంగం చేసి, రెండేళ్ల పాలనలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని, భవిష్యత్ ప్రణాళికలను ప్రజల ముందుంచారు. తన రాజకీయ ప్రస్థానం మొదలైన తిరుపతిలో, ఏడుకొండలస్వామి చెంతన ఈ కార్యక్రమం జరగడం సంతోషంగా ఉందని, ఇది తనకు పునర్జన్మ లాంటిదని ఆయన వ్యాఖ్యానించారు. - మిగతా2లో

## తెలంగాణలో పోటీ చేసేందుకు పవన్ కల్యాణ్‌కు

# పూర్తి స్వేచ్ఛ ఉంది



హంసకలం వార్త: తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు - మిగతా2లో

# ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి



2

కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఓట్ల తొలగింపునకు కుట్ర..
30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్' పేరిట లేపేసే ప్లాన్..
బీహార్, బెంగాల్ ఫార్ములాను ఇక్కడా ప్రయోగిస్తున్నారు..
కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష ప్రభుత్వాలపై దాడి..

**పాలేరు 'బి.ఎల్.ఏ'ల శిక్షణ శిబిరంలో మంత్రి పొంగులేటి నిప్పులు..**

# సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు

## కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్



- రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై మీనాక్షి నటరాజన్ పిటిషన్ కొట్టివేత
- ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతుందో ఈ ఘటనతో వెల్లడైందని వ్యాఖ్య

హంసకలం వార్త: రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టులో చుక్కెదురైనప్పటికీ, ఇది తనకు ఎదురుదెబ్బ కాదని కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతోందో ఈ ఘటనతో బహిర్గతమైందని ఆమె వ్యాఖ్యానించారు. రాజ్యాంగ సంస్థలపై గౌరవం ఉందని, అందుకే కోర్టు తీర్పుపై నేరుగా స్పందించనని తెలిపారు. ఈ పరిణామం తనను షాక్‌కు గురిచేయలేదని మీనాక్షి నటరాజన్ అన్నారు. ఎన్నికల కమిషన్ - మిగతా2లో

# మన గొప్ప ఎగుమతి మన ప్రజలే: విశాఖ సదస్సులో నారా లోకేశ్

హంసకలం వార్త:
వికసిత్ భారత్ నిర్మాణం అనే బృహత్ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తుందని, నైపుణ్యం కలిగిన మానవ వనరులను సృష్టించడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సుసంపన్న భవిష్యత్తు కోసం మానవ వనరుల పై పెట్టుబడి పెట్టడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన అన్నారు. విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో జరిగిన 'డీజీ 100ఎక్స్ ఏపీ' సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య - మిగతా2లో






## 'ఉత్తమ వైద్యం అందిస్తాం'..

**చిన్నారి ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ**

-వివరాలు2లో

## రాష్ట్ర ప్రజలకు... ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండు ఏళ్ల నమ్మకం



- తిరుపతిలో అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తోని రాష్ట్ర అభివృద్ధి
- నియోజకవర్గ ప్రజలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించింది
- శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

# అతి త్వరలో యథావిధిగా సింగరేణి మెడికల్ బోర్డు

- మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలి.
- అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు చేపట్టాలి.
- సింగరేణి యాజమాన్యానికి ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి
- శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు
- కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడి



హంసకలం వార్త : సింగరేణి కార్మికులకు శుభవార్త. సింగరేణిలో వివిధ కారణాలతో కొద్ది కాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. - మిగతా2లో

# 190 జీవో ను వెంటనే అమలు చేయాలి

**317 జీవో బాధితులైన టీచర్లు, ఉద్యోగులకు వెంటనే న్యాయం చేయాలి**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



హంసకలం వార్త : జీవో నంబర్ 317 బాధితులైన టీచర్లు, ఉద్యోగులకు వెంటనే న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన మధ్యంతర జీవో 190 ని వెంటనే అమలు చేయాలన్నారు. వెంటనే 190 జీవో అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు 317 జీవో బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ...అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని మోసం చేస్తోందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. -మిగతా2లో

# అతి త్వరలో యథావిధిగా సింగరేణి మెడికల్ బోర్డు

-మొదటిపేజీ **తరువాయి:** ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించా లని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవ ర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు. ఇటీవల కాలం వరకు కారుణ్య నియామ కాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు మంచిర్యాలలో శనివారం (ఈ నెల 13వ తేదీ) జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు తెలియజేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిష్కరి ంచేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్లు.. ఇందులో భాగంగానే ఈ అంశంపై న్యాయ పరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిబంధనల మేరకు న్యాయ సలహా ప్రకారం సానుకూలంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ సింగరేణి.**

అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామన్నారు. వీటిలో 555 ఎక్సటర్నల్ పోస్టులు ఉండగా 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడా ఆన్లైన్ పద్ధతిలో చేపట్టి వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు. కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచడం ద్వారా మరింత మంది అర్హులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించేలా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఇదే కాకుండా బ్యాంకులతో సంప్రదింపులు జరిపి ఇటీవలే సింగరేణి ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాన్ని కూడా కల్పించా మన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు కూడా 40 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామ న్నారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా కార్మికులకు లాభాల వాటాను చెల్లించామని తెలియజేశారు. గత రెండేళ్లలో రూ.1500 కోట్లను లాభాల వాటా రూపేనా చెల్లించినట్లు వెల్లడించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్ను చెల్లిస్తున్నామని, 2023-24లో ఒక్కొక్కరికీ రూ.5,000 చొప్పున, 2024-25లో రూ.5,500 చొప్పున లాభాల బోనస్ను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణిలో ప్రతీ ఉద్యోగికి అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో అన్ని ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ చేసేలా చర్యలు తీసుకోవడమే కాకుండా గోదావరిఖని లో క్యాథ్ ల్యాబ్ను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, డిపెండెంట్ పిల్లల వైద్య సేవల కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా సింగరేణి కార్మికుల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసినట్లు పేర్కొన్నారు. అందువల్ల సింగరేణి కార్మికుల పట్ల తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత మరియు వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా సింగరేణిని బహుముఖంగా విస్తరించేందుకు, కొత్త బొగ్గు బ్లాక్లు సాధించేందుకు తద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయ న్నారు. ఒడిశా నైనీ బ్లాక్ అనుమతులతోపాటు బొగ్గు ఉత్పత్తికి ప్రజా ప్రభుత్వంలో తీసుకున్న ప్రత్యేక చొరవను గుర్తుచేశారు. రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణిని విస్తరించే దిశగా తాము ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అయితే పోటీ మార్కెట్లో సింగరేణి నిల దొక్కుకోవాలంటే ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలని, ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# తెలంగాణలో పోటీ చేసేందుకు పవన్ కల్యాణ్కు పూర్తి స్వేచ్ఛ ఉంది

-మొదటిపేజీ **తరువాయి:** పవన్ కల్యాణ్పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్రెడ్డే కారణమని కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా? అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. గాడ్సేనే కాదు.. కిమ్ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు.

# ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి..

-మొదటిపేజీ **తరువాయి:** కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెరలేపిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా బీజేపీపాలితా ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో అప్రజాస్వామిక పాలన సాగుతోందని మండిపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి.ఎల్.ఏ) అవగాహన శిక్షణ శిబిరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట క్రాస్ రోడ్డులో గల పీవీఆర్ గార్డెన్స్లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, బీజేపీ రాజకీయ వ్యూహాలను ఎండగడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు.

**- 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం.. దొంగదారి చర్య!**

కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిన 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం లాంటిదని, ఇది ముమ్మాటికీ దొంగదారి చర్యేనని మంత్రి విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో, ఎక్కడైతే మనకు ఓట్లు ఎక్కువగా ఉన్నాయో.. అక్కడ ఒక పద్ధతి ప్రకారం దాదాపు 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్ ఓట్లు'గా చిత్రీకరించి, వాటిని జాబితా నుంచి తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోంది. ఓటరు వయస్సులో స్వల్ప తేడాలున్నా, పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ (రావుకు బదులు రెడ్డి, హుస్సేన్ బదులు శ్రీ అని పడటం) ఉన్నా.. వాటన్నింటినీ వంకగా చూపి ఓట్లను లేపేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీహార్, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఈ పద్ధతిని ప్రయోగించి సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ ప్రయోగించాలని చూస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ సైనికులు గట్టిగా తిప్పికొట్టాలి" అని మంత్రి పిలుపునిచ్చారు.

**నిన్న ఓట్లు.. నేడు ఏకంగా సీట్లే దొంగిలిస్తున్నారు!**

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతాన్ని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "మీనాక్షి నటరాజన్ గారికి కావలసిన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి, ఎన్నికల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్ను తిరస్కరింపజేశారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన ఒక రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారు. నిన్నటి వరకు ఓట్లను దొంగిలించిన వాళ్ళు.. ఈరోజు ఏకంగా సీట్లనే దొంగిలించే దుస్థితికి కేంద్ర ప్రభుత్వం దిగజారింది" అని నిప్పులు చెరిగారు.

**సీబీఐ, ఈడీలతో బెదిరింపు రాజకీయాలు.**

బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం దేశంలోని ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థలను వేట కుక్కల్లా వాడుకుంటోందని మంత్రి తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్న సీబీఐ , ఈడీ , ఇన్కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని, వేరే పార్టీల తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, భారతదేశంలో ఎక్కడ బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నా ఇదే రకమైన దుర్మార్గపు పరిపాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ కావాలి..**

జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే 'ఓట్ మ్యాపింగ్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. "ఉద్యోగాలు, చదువుల రీత్యా ఖమ్మం, హైదరాబాద్లలో ఉండే మన వాళ్ళు అధికారులు వచ్చినప్పుడు ఊర్లో లేరనే సాకుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. అధికారులు వచ్చే ముందే గ్రామంలో చాటింపు వేయించి వేరే ఊర్లలో ఉన్న మన ఓటర్లను రప్పించి ఓటు కాపాడుకోవాలి. మనకు దొంగ ఓట్లు అవసరం లేదు.. మనకున్న జనాదరణతో ప్రతి ఓటునూ ఒక కాంక్రీట్ గోడ లాగా కాపాడుకోవాలి" అని స్పష్టం చేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కాబోయే ప్రధానమంత్రి, మన నాయకుడు రాహుల్ గాంధీకి కార్యకర్తలంతా సైనికుల్లా అండగా నిలబడాలని, ఈ అక్రమ ఎస్ఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పీసీసీ ప్రతినిధి సుధాకర్, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్, ఏదులాపురం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్ల బి.ఎల్.ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాళ్లకు ఎలాంటి విజన్ లేదు... పాయిజన్ మైండ్!: తిరుపతి సభలో చంద్రబాబు

-మొదటిపేజీ **తరువాయి:**

2024 ఎన్నికల్లో 57 శాతం ఓట్ షేర్తో ప్రజలు ఎన్డీఏ కూటమికి చారిత్రక విజయాన్ని అందించారని చంద్రబాబు గుర్తుచేశారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికే ఈ సభను నిర్వహిస్తున్నామని, ప్రజాసేవకు తమ ప్రభుత్వం పునరంకితమవుతోందని ప్రకటించారు. ఈ రెండేళ్లలో ఏం చేశామో, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏం చేయలేకపోయామో కూడా ప్రజలకు చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని, తమ పాలనలో దాపరికం ఉండదని స్పష్టం చేశారు. కష్టకాలంలో విజ్ఞతతో డబుల్ ఇంజన్ సర్కార్కు ఓటేసి రాష్ట్రాన్ని గెలిపించిన ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. వెంటిలేటర్పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం ఆక్సిజన్ ఇచ్చి బతికించిందని, ఈ రోజు ప్రజలు శాంతియుతంగా, తమ ఆస్తులకు రక్షణతో జీవించగలుగుతున్నారంటే అది ఎన్డీఏ పాలన వల్లే సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనను 'చీకటి పాలన'గా అభివర్ణించిన చంద్రబాబు, ఆ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా విధ్వంసం చేశారని ఆరోపించారు. కేంద్ర పథకాలను పక్కనపెట్టి, సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. పెట్టుబడిదారులను వేధించి రాష్ట్రం నుంచి తరిమేశారని, యువత భవిష్యత్తును దెబ్బతీశారని అన్నారు. కేంద్రం ఇంటింటికి కుళాయి కోసం రూ.27,000 కోట్లు ఇస్తే, దానిని కూడా వాడుకోలేని దుస్థితిలో గత ప్రభుత్వం ఉందని విమర్శించారు. తనతో పాటు పవన్ కల్యాణ్ను కూడా అడుగడుగునా వేధించారని, ఎలాంటి నోటీసు లేకుండా తనను 53 రోజులు జైల్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

## రాష్ట్ర ప్రజలకు... ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండు ఏళ్ల నమ్మకం

ఆత్మకూరు జూన్ 12 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలకు రెండేళ్ల పరిపాలనలో సుపరిపాలన కొనసాగిందని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు శుక్రవారం తిరుపతిలో జరిగిన కూటమి ప్రభుత్వ రెండు సంవత్సరాల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమానికి శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే హాజరయ్యారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు హాజరయ్యారు ఇందులో భాగంగా రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేకూర్చే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది ఈ సందర్భంగా శ్రీశైల నియోజకవర్గం, అభివృద్ధి, సంక్షేమం,కల్పించే విధంగా నియోజకవర్గ ప్రజలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని వివరించారు

## 'ఉత్తమ వైద్యం అందిస్తాం'..

-మొదటిపేజీ **తరువాయి:** స్పైనల్ మస్కులర్ అట్రోఫీ టైప్-2తో బాధపడుతున్న బేబీ ఆర్యాంశ్కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్యాంశ్ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సహాయం అందిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన ఏడాది వయసున్న ఆర్యాంశ్ ప్రాణాలను కాపాడేందుకు ఇంజెక్షన్కు రూ.1.5 కోట్లు అవసరం. జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్ను బుక్ చేసుకోవాలని, జులై నెలాఖరులోగా చికిత్స పూర్తిచేయాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. దీంతో ప్రజల సహకారంతో ఇప్పటివరకు రూ.75 లక్షలను తల్లిదండ్రులు సేకరించారు. మరో రూ.75 లక్షలు కావాల్సి ఉండగా.. ఆ నిధుల సమీకరణకు ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు. అమెరికా క్షిపణి దాడిలో విశాఖ వాసి మృతిపై సీఎం చంద్రబాబు విచా చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కావాల్సిన నిధులపై యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదిరెడ్డి పోస్ట్కు సీఎం వెంటనే స్పందించారు. 'చిన్నారికి ఉత్తమ చికిత్స అందేలా చేస్తాం. సీఎంఆర్ఎఫ్ అధికారులు.. ఆ చిన్నారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని ఎక్స్లో రేవంత్ పోస్ట్ చేశారు. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ అధికారులు తక్షణమే చిన్నారి ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్నారు.

## 190 జీవో ను వెంటనే అమలు చేయాలి

-మొదటిపేజీ **తరువాయి:** ఏ నిర్ణయం తీసుకోవాలన్నకూడా ఈ ప్రభుత్వానికి గుండె ధైర్యం లేని పరిస్థితి కనిపిస్తుందని చెప్పారు. ఉద్యమకారులు, ఉద్యోగులకు సంబంధించిన అంశాల్లో కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. 317 జీవో బాధితులకు న్యాయం చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆ విషయంలో ముందడుగు వేయటం లేదో చెప్పాలన్నారు. 317 బాధితులైన టీచర్లు, ఉద్యోగులకు స్థానికత ఆధారంగా బదిలీలు చేస్తామని చెప్పి దామోదర రాజనర్సింహా, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ వేశారని...ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇచ్చిన 190 జీవో ను ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. 317 జీవో బాధితులైన టీచర్లకు స్థానికత ఆధారంగా బదిలీలు చేస్తామని చెప్పారని...అవసరమైతే సూపర్ న్యూమరీ ఉద్యోగాలు కూడా సృష్టిస్తామని హామీ ఇచ్చారని కవిత గుర్తు చేశారు. కానీ 190 జీవో తెచ్చి తొమ్మిది నెలలు గడిచినా దానిని అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఎవరి కోసం, ఏ పైరవీ కోసం ఈ జీవోను అమలు చేయటం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. 190 జీవో గడువే మూడేళ్లు ఉందని ఇప్పటికే 9 నెలలు గడిచిపోయిందని ఇంకెప్పుడూ అమలు చేస్తారని ప్రశ్నించారు.

**ఉద్యోగుల కోసం మేము పోరాడుతాం**

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి కారణంగా టీచర్లు, ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని కవిత అన్నారు. 317 జీవో కారణంగా వారంత స్థానికత కోల్పోయారని చెప్పారు. జీవో 25 రేషనలైజేషన్ తో సంబంధం లేకుండా వెంటనే 190 జీవోను అమలు చేయాలని కవిత కోరారు. అవసరమైతే టీచర్ల కోసం సూపర్ న్యూమరీ ఉద్యోగాలు క్రియేట్ చేయాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చేస్తోన్న తాత్సారంపై ఉద్యోగ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని కవిత పిలుపునిచ్చారు. టీచర్లు, ఉద్యోగుల హక్కుల కోసం వారి తరపున తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని కవిత చెప్పారు. వెంటనే 190 జీవో అమలు పై చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని కవిత హెచ్చరించారు.

## సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు

-మొదటిపేజీ **తరువాయి:** అయితే తమ న్యాయపరమైన వాదనలో ఎలాంటి బలహీనత లేదని ఆమె పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు వేసిన తన నామినేషన్ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్లతో కూడిన ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. నామినేషన్ తిరస్కరణకు గురైన తర్వాత, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. దీనిపై ఎన్నికల సంఘంలో పిటిషన్ ద్వారానే పరిష్కారం వెతుక్కోవాలని సూచించింది. 2022లో తెలంగాణలో నమోదైన ఒక క్రిమినల్ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అఫిడవిట్లో వెల్లడించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో జూన్ 9న రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్ను తిరస్కరించారు. అయితే, రెండేళ్లకు పైగా శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల వివరాలు మాత్రమే వెల్లడించాల్సి ఉంటుందని, ఈ కేసులో కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని ఆమె తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు.

## మన గొప్ప ఎగుమతి మన ప్రజలే: విశాఖ సదస్సులో నారా లోకేశ్

-మొదటిపేజీ **తరువాయి:**

ప్రపంచం అత్యంత వేగంగా మారుతోందని, కృత్రిమ మేధ (ఏఐ) వంటి సాంకేతికతలు పరిశ్రమలను, ఉద్యోగాలను పునర్నిర్వచిస్తున్నాయని లోకేశ్ అన్నారు. ఈ పోటీ ప్రపంచంలో ఏ దేశానికైనా, రాష్ట్రానికైనా అసలైన బలం భూమి, సహజ వనరులు కావని, ప్రతిభ కలిగిన మానవ వనరులేనని నొక్కిచెప్పారు. దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ దేశానికి అత్యుత్తమ ప్రతిభను అందించిందని, చంద్రబాబు గత పదవీకాలాల్లో చేపట్టిన సంస్కరణల ఫలితంగానే నేడు సిలికాన్ వ్యాలీ నుంచి సింగపూర్ వరకు తెలుగువారు ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు. మన గొప్ప ఎగుమతి మన ప్రజలేనని, వారి పై పెట్టుబడి పెట్టడం మనందరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. విద్య అంటే కేవలం డిగ్రీ సర్టిఫికేట్ ఇవ్వడం కాదని, జీవితాంతం నేర్చుకునే ప్రక్రియలో ప్రభుత్వం భాగస్వామి కావాలని అన్నారు. అందుకోసం రెండు వారాల్లో "నైపుణ్యం పోర్టల్" ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిన్నటి ఉద్యోగాల కోసం కాకుండా, ఏఐ, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్ వంటి భవిష్యత్ రంగాల కోసం విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని వివరించారు.

**వ్యక్తిగత ఇష్టంతోనే విద్యాశాఖ బాధ్యతలు**

ముఖ్యమంత్రి శాఖల కేటాయింపు సమయంలో తాను అడిగి మరీ విద్యాశాఖను తీసుకున్నాననిలోకేశ్ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. చాలా మంది వద్దని వారించినా, తదుపరి తరం నాయకులను ప్రేరేపించే అవకాశం విద్య ద్వారానే లభిస్తుందనే బలమైన నమ్మకంతో ఈ బాధ్యతను స్వీకరించానని తెలిపారు. పిల్లలను నేను హృదయపూర్వకంగా ప్రేమిస్తాను... వారు చూపే ప్రేమ, ఆప్యాయత, నిజాయతీ నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తాయి... అందుకే విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించానని చెప్పారు.

# సంపాదకీయం

## సంకల్పం మంచిదే... అమలే సవాలు!

ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను హేతుబద్ధీకరించి, తక్కువ విద్యార్థులున్న వేలాది పాఠశాలల స్థానంలో సమగ్ర 'క్లస్టర్ పాఠశాలలు' ఏర్పాటు చేయాలనే తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదన విద్యావేత్తలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల మధ్య విస్తృత చర్చకు దారితీసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పం ప్రశంసనీయం. ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండటంతో అన్ని సబ్జెక్టులకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించడం సాధ్యం కావడం లేదని ప్రభుత్వం పేర్కొంటోంది. కేవలం కొద్దిమంది విద్యార్థుల కోసం వేలాది పాఠశాలలను నిర్వహించడం ప్రజాధనాన్ని సమర్థవంతంగా వినియోగించడం కాదని వాదిస్తోంది. అందువల్ల వాటిని విలీనం చేసి, నర్సరీ నుంచి ఇంటర్ వరకు బోధన, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, డిజిటల్ విద్యా వనరులు, క్రీడా సదుపాయాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఉచిత రవాణా వంటి సౌకర్యాలతో కూడిన క్లస్టర్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. విద్యాపరంగా చూస్తే ఈ ప్రతిపాదనకు కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. పెద్ద పాఠశాలల్లో గణితం, విజ్ఞానం, ఆంగ్లం, సామాజికశాస్త్రం వంటి ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు పరస్పర పోటీ, సమూహ అధ్యయనం, క్రీడలు, ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు పెరుగుతాయి. అలాగే ప్రభుత్వ నిధులను విభజించి చిన్న చిన్న పాఠశాలలపై ఖర్చు చేయడం కంటే, కొద్ది పాఠశాలలను ఉన్నత ప్రమాణాలతో అభివృద్ధి చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. అయితే ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల అందుబాటు అత్యంత కీలకం. ప్రస్తుతం అనేక మంది పిల్లలు తమ గ్రామంలోనే లేదా నడిచి వెళ్లగలిగే దూరంలో ఉన్న పాఠశాలల్లో చదువుతున్నారు. ఈ పాఠశాలలను విలీనం చేస్తే, వారు ప్రతిరోజూ అనేక కిలోమీటర్లు ప్రయాణించి క్లస్టర్ పాఠశాలలకు వెళ్లాల్సి వస్తుంది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఇది పెద్ద భారం. ప్రభుత్వం ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తామని ప్రకటించింది. అయితే సమగ్ర ప్రణాళిక, తగిన నిధుల కేటాయింపు, సమర్థవంతమైన పరిపాలనపై దాని విజయం ఆధారపడి ఉంటుంది. బస్సుల కొరత, రోడ్ల సమస్యలు లేదా నిర్వహణలో లోపాలు ఏర్పడితే పిల్లల హాజరు ప్రభావితమవుతుంది. ఆరు లేదా ఏడు సంవత్సరాల వయస్సు గల పిల్లలు ప్రతిరోజూ ఎక్కువ దూరం ప్రయాణిస్తే అలసిపోతారు. చదువుకు తక్కువ సమయం, ఆటపాటల కొరత వంటి సమస్యలు తలెత్తవచ్చు. చిన్న పిల్లలను దూర ప్రాంతాలకు పంపడానికి తల్లిదండ్రులు కూడా సంకోచించవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో యుక్తవయసు బాలికలు ఎక్కువ దూరం ప్రయాణించడం పట్ల అనేక కుటుంబాల్లో ఇప్పటికీ ఆందోళనలున్నాయి. భద్రత, రవాణా, సమయపాలన వంటి అంశాల కారణంగా వారు చదువును మధ్యలోనే నిలిపివేసే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పేద, అట్టడుగు వర్గాల పిల్లలపై ఇది ప్రభావం చూపుతుంది. పాఠశాలల విలీనంతో ఉపాధ్యాయుల బదిలీలు పెరగడం, గ్రామాలతో ఏర్పడిన అనుబంధం దెబ్బతినడం, పెద్ద పాఠశాలల్లో పని భారం అధికమయ్యే అవకాశం ఉంటుంది. తగిన ఆర్థిక వనరులు కేటాయించకుండా, రవాణా వ్యవస్థను బలోపేతం చేయకుండా, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా పాఠశాలల విలీనాన్ని తొందరపడి అమలు చేస్తే గ్రామీణ పిల్లలకు ప్రతికూల ప్రభావం కలుగుతుంది. పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఇది విద్యాభ్యాసంలో పెద్ద ఆటంకం. ప్రతి గ్రామానికి సమీపంలో ప్రాథమిక పాఠశాలలు కొనసాగిస్తూ, ఉన్నత తరగతుల కోసం మాత్రమే క్లస్టర్ పాఠశాలలను అభివృద్ధి చేయడం ఒక ఉత్తమ ప్రత్యామ్నాయం. దీని అమలుకు ముందు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలతో విస్తృతంగా సంప్రదింపులు జరపాలి. అమలు అనంతరం విద్యార్థుల నమోదు, హాజరు, చదువు మానివేత శాతం వంటి అంశాలను నిరంతరం పరిశీలించి అవసరమైన మార్పులు చేయాలి. విద్యా సంస్కరణల లక్ష్యం నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా ప్రతి చిన్నారికీ విద్య అందుబాటులో ఉండేలా చూడడం కావాలి. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పం ప్రశంసనీయం. అయితే ఈ క్రమంలో ఏ ఒక్క చిన్నారి కూడా దూరం, రవాణా లేదా ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యకు దూరం కాకుండా చూడడం ప్రభుత్వ బాధ్యత. మెరుగైన భవనాలు నిర్మించడం కంటే ప్రతి చిన్నారికి మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడమే ఈ సంస్కరణ విజయానికి కొలమానం కావాలి.

# విధ్వంసం.. విశేషాలు.. వెలుగులు!







యుద్ధ విధ్వంసాలూ దారుణాలూ లెక్కలేనన్ని బాధలనూ కలగచేస్తాయనే సంగతి అందరికీ తెలిసిందే. అందులో ప్రత్యేకత ఏమీలేదు. ప్రతి యుద్ధంలోనూ అవే పునరావృతం అవుతాయి. వాటిల్లో సమిధలు అయ్యేదీ సాధారణ ప్రజలే. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సాగిస్తోన్న దాడులకూ దురాగతాలకూ హెజ్బుల్లా తీవ్రవాదులే మరణించటం లేదు. సాధారణ ప్రజలే ఎక్కువగా బలవుతున్నారు. అమెరికా--ఇజ్రాయెల్‌లు 40 రోజుల పాటు ఇరాన్‌పై చేసిన యుద్ధంలో ఎంతమంది చనిపోయారో అంతకుమించి లెబనాన్ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కటువుగా హెచ్చరికలు చేసినా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను ఆపటం లేదు. ఏదో ఒక మిషతో వాటిని కొనసాగిస్తూనే ఉంది. ఇక లెబనాన్‌లో దాడులనూ విధ్వంసాలనూ ఆపితేనే శాంతిప్రక్రియ కొలిక్కివస్తుందని అమెరికాకు ఇరాన్ తేల్చిచెబుతోంది. పశ్చిమాసియాలో శాంతి ఏర్పడి హోర్ముజ్ దిగ్బంధం తొలగిపోవాలంటే లెబనాన్‌లో పరిస్థితి కుదుటపడాలి. అదంత తేలికగా జరుగుతుందని చెప్పలేం. 1975 నుంచి ఇప్పటివరకూ ఏదో విధంగా సంక్షోభాన్ని లెబనాన్ ఎదుర్కొంటూనే ఉంది. లెబనాన్ చాలా చిన్నదేశం. చమురు వనరులు పెద్దగా లేవు. ఆ దేశ ఉత్తరాది సరిహద్దు నుంచి దక్షిణాదికి మధ్య దూరం 217 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఇక తూర్పు, పశ్చిమాల మధ్య దూరం మరీ తక్కువ. 32 నుంచి 88 కిలోమీటర్ల మధ్యే ఉంటుంది. మొత్తంగా దేశ విస్తీర్ణమే 10,452 చదరపు కిలోమీటర్లు మాత్రమే. అంటే హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలెప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధికి సమానంగా లెబనాన్ విస్తీర్ణం ఉంటుంది. జనాభా 58 నుంచి 60 లక్షల లోపుగానే ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. అంచనాలేనని ఎందుకు అనుకోవాల్సి వస్తుందంటే 1932 నుంచి ఇప్పటివరకూ అక్కడ జనాభాను అధికారికంగా గణించలేదు. 1932 నాటి లెక్కల ప్రకారమే ఇప్పటికీ అక్కడ చాలావరకూ పదవులూ ఉద్యోగాల పంపకాలూ ఆధారపడి ఉన్నాయి. ఇంకో విచిత్రం కూడా లెబనాన్‌లో ఉంది. మొత్తం జనాభాలో దాదాపు 15 నుంచి 20 లక్షల మంది సిరియా, పాలస్తీనా నుంచి వచ్చిన శరణార్థులే ఉన్నారు. అంటే జనాభాలోని ప్రతి నలుగురిలో ఒకరు శరణార్థే అన్నమాట. ఈ పరిస్థితి ప్రపంచంలో మరే దేశంలోనూ లేదు. లెబనాన్ అంటే హెజ్బుల్లాలు, ఇజ్రాయెల్‌పై వాళ్లు ప్రయోగించే రాకెట్లు మాత్రమే కాదు. అంతకు మించిన ఘనచరిత్రా లెబనాన్‌కు ఉంది. తొలి లిపి అక్కడే రూపుదిద్దుకున్నదని చెప్పే చరిత్రా మనకు ఎదురవుతుంది. యూరప్‌కూ ఆసియాకూ మధ్య శతాబ్దాలపాటు వారధిగా నిలిచింది. లెబనాన్‌లో అడుగుపెట్టని మహాసామ్రాజ్యం లేదు. మతహింస బాధితులందరికీ ఒకనాడు లెబనాన్ ఆశ్రయమిచ్చి అక్కున చేర్చుకొనేది. అందుకే ఈనాటి విధ్వంసాలు, ప్రతివిధ్వంసాలను దాటుకుని కాస్త వెనుకకు వెళ్లి చరిత్రను చూస్తే ఎన్నో విశేషాలూ, వెలుగులూ కనపడతాయి. కులాల జనాభా ప్రాతిపదిక మీద ఉద్యోగాలూ, పదవులూ ఇవ్వాలనే డిమాండు భారత్‌లో ఊపందుకుంటున్న వేళ లెబనాన్ ఎంతో ముందుగా ఆ తరహా పద్ధతిని మతప్రాతిపదికన ప్రవేశపెట్టి సాధించిన విజయాలనూ, తెచ్చిపెట్టుకున్న ఘోర సమస్యలనూ పరిశీలిస్తే ఇక్కడి సామాజిక సమస్యలపై ఎలాంటి వైఖరి అనుసరించాలో కొంతైనా తెలుస్తుంది. పశ్చిమాసియాలో ఒకప్పుడు (1950, 1960ల్లో) లెబనాన్ చాలా వాటిల్లో ముందుండేది. బహుళపార్టీ రాజకీయ వ్యవస్థతో పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ తర్వాత ప్రజాస్వామ్యాన్ని కలిగిన దేశంగా గుర్తింపు ఉండేది. అంతర్జాతీయ బ్యాంకింగ్ వ్యవస్థకు కీలక దేశంగా రూపుదాల్చింది. దీంతోపాటు వినోదరంగం, ప్రసారమాధ్యమ రంగం, పర్యాటకరంగం బాగా అభివృద్ధి అయింది. విదేశీపెట్టుబడులకు ఎలాంటి ఆటంకం ఉండేది కాదు. పశ్చిమాసియాలో మిగులుధనం అంతా బీరూట్ బ్యాంకుల్లోకే ప్రవహించేది. పన్నులు సరళంగా ఉండటం పెట్టుబడులను బాగా ఆకర్షించటానికి తోడ్పడింది. తలసరి ఆదాయంలో లెబనాన్ 1950ల్లో పశ్చిమాసియాలో బాగా ముందుండేది. 1970ల మధ్యకు వచ్చేసరికి ఇదంతా మారిపోయింది. ఒకప్పుడు అన్ని మతాలకు రాజకీయపదవుల్లో, ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం కల్పించటానికి ఏర్పాటైన వ్యవస్థ కాలక్రమంలో మతతత్వ ఆలోచనలు బలపడటానికి దోహదం చేసింది. జాతీయభావన అట్టడుగుకు వెళ్లిపోయి మత, తెగ పక్షపాత ఆలోచనలూ ప్రయోజనాలే ప్రధానం అయ్యాయి. లెబనాన్‌లో ప్రధానంగా 18 మతసమూహాలను గుర్తించారు. జనాభాలో వాటి సంఖ్యను బట్టి రాజకీయాధికారంలో ప్రాతినిధ్యం కల్పించారు. జనాభాను మతవర్గాల వారీగా చూసి, ఆ వర్గాల వారీగా అధికారాన్ని కొంతవరకూ విభజించటం లెబనాన్‌పై ఫ్రెంచ్ నియంత్రణ (1920--1943) ఉన్న కాలంలోనే మొదలైంది. వలసదేశాల్లో ప్రజలను విభజించి పాలించే పద్ధతిని బ్రిటిష పాలకులతో పాటు ఫ్రెంచ్ పాలకులూ పాటించారు. మతపరమైన విభజనలనూ, అపనమ్మకాలనూ తొలగించే రీతిలో కాకుండా అవి మరింత బలపడేలా విధానాలను రూపొందించారు. లెబనాన్‌కు 1943లో స్వాతంత్ర్యం లభించింది. అప్పుడే పెద్దమనుషుల ఒప్పందం లాంటిది కుదుర్చుకుని మతవర్గాల వారీగా (కన్ఫెనల్ సిస్టమ్) అధికారం కట్టబెట్టే విధానానికి సంపూర్ణ రాజ్యాంగబద్ధతను కల్పించారు. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత బ్రిటన్, ఫ్రాన్స్‌లు పశ్చిమాసియాలోని భూభాగాలను తమకు ఇష్టం వచ్చినట్లు పంచుకున్నాయి. రాజకీయ సరిహద్దులను తమ ప్రయోజనాల కోసమే నిర్ణయించాయి. అక్కడ నివసించే ప్రజల భావాలను పరిగణనలోకి తీసుకోలేదు. దీర్ఘకాలికంగా తలెత్తే సమస్యలనూ పట్టించుకోలేదు. ఏ దేశంలో ఏ భూభాగం ఉంటే సాంస్కృతికంగా ప్రజల మధ్య సారూప్యత ఉంటుందో గ్రహించలేదు. స్వార్థప్రయోజనాలే ప్రధానంగా అప్పట్లో తీసుకున్న నిర్ణయాలతో ఇప్పటికీ పశ్చిమాసియా భగ్గుమంటూనే ఉంది. యూదులకు పాలస్తీనాలో ప్రత్యేక దేశం ఏర్పాటుచేస్తామని బ్రిటన్ ఏకపక్షంగా ప్రకటించి, క్రమేపీ స్థానిక అరబ్బులను నిర్వాసితులను చేయటంతోనే అసలు నిప్పు రాజుకుంది. మొదట్లో మౌంట్ లెబనాన్ అనేది ఒక రాష్ట్రంగా టర్కీ సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. అప్పటికి అక్కడ క్రైస్తవుల జనాభానే ఎక్కువగా ఉండేది. కొన్ని ఇతర భూభాగాలను కలిపి ఒక కొత్త దేశంగా గ్రేటర్ లెబనాన్ (1920)ను ఫ్రాన్స్ ఏర్పాటు చేసింది. కొత్త ప్రాంతాలు వచ్చి చేరటంతో ముస్లింల జనాభా పెరిగింది. అయినా 1943 నాటికి ఒకటి రెండు శాతం ఎక్కువగా క్రైస్తవులే ఎక్కువగా ఉండేవారు. వివిధ మతాలను సంతృప్తిపరచటానికి ఏర్పాటుచేసిన కన్ఫెనల్ సిస్టంతో లెబనాన్ అధ్యక్షుడిగా క్రైస్తవ మతానికి (మరొనైట్) చెందిన వ్యక్తినే ఎన్నుకోవాలి. ప్రధానమంత్రి సున్నీ మతానికి చెందిన వ్యక్తే అయివుండాలి. పార్లమెంట్ స్పీకర్ పదవికి షియా ముస్లిమే ఎన్నిక కావాలి. మొదట్లో ఇతర రాజకీయ పదవులన్నీ 6:5 పద్ధతిలో నింపేవారు. అంటే ఆరు పదవులు క్రైస్తవులకు ఉంటే మిగతా అయిదూ ముస్లింలకు లభించేవి. 1989లో దీన్ని 5:5కు మార్చారు. పౌర, సైనిక ఉద్యోగాల్లో కూడా మతపరమైన కోటాల వ్యవస్థే అమలైంది. దీన్ని క్రమేపీ ప్రతిభ ఆధారితంగా మార్చాలని 1989లోనే ఒక అంగీకారానికి వచ్చినా అనుకున్న విధంగా ఇప్పటికీ దాన్ని అమలు చేయలేకపోతున్నారు. పార్లమెంటులో 128 స్థానాలుంటే వాటిని సగంసగం చొప్పున క్రైస్తవులకు, ముస్లింలకు కేటాయిస్తున్నారు. క్రైస్తవుల్లో ఏడు వర్గాలకు 64 సీట్లను పంచారు. అలాగే ముస్లింల్లో నాలుగు విభాగాలకు వాటిని కేటాయించారు. మరొనైట్ క్రైస్తవుడికి కేటాయించిన సీటులో ఆ వర్గానికి చెందిన వ్యక్తులే పోటీచేయాలి. ఓటర్లుగా అన్ని మతాలకు చెందినవారూ ఉంటారు. అభ్యర్థులూ ఓటర్లూ ఒక మతానికి చెందినవారే ఉండాలనే విధానాన్ని ప్రవేశపెడితే పరిస్థితి బాగా ఘోరంగా మారేది. పదవులనూ ఉద్యోగాలనూ మతపరమైన కోటాలతో నింపటం మొదలైన తర్వాత అన్నీ మతం చుట్టూనే తిరగటం మొదలైంది. వ్యక్తులను పౌరులుగా చూడటం పోయి, మతానికి చెందిన వ్యక్తులుగా చూడటం బలపడింది. మతదృష్టి పెరిగిపోయిన తర్వాత కొన్ని విషయాలను ఆ దృష్టితోనూ మరికొన్ని విషయాలను లౌకిక దృష్టితోనూ చూడటం అసాధ్యంగా మారుతుంది. క్రైస్తవులు పాశ్చాత్యదేశాలతో సఖ్యత కోరుకుంటే ముస్లింలు అరబ్బుదేశాలతో సఖ్యతను ఆశించారు. పాలస్తీనా సమస్య లెబనాన్‌కు జీవన్మరణ సమస్యగా మారింది. పాలస్తీనా శరణార్థులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్‌పై దాడులు మొదలయ్యాయి. 1970ల తర్వాత కొన్నేళ్లపాటు లెబనానే పాలస్తీనా ఉద్యమకారులకు ప్రధానస్థావరంగా మారింది. ఇజ్రాయెల్ ప్రతి చిన్న సంఘటనను ఉపయోగించుకుని పెద్దఎత్తున దాడులకూ విధ్వంసాలకూ పాల్పడటం మొదలుపెట్టింది. పౌర నివాసాలను, ఆసుపత్రులను, పరిశ్రమలను, విమానాశ్రయాలను, మౌలిక రవాణా సదుపాయాలను నాశనం చేసింది. వీటితో బాగా నష్టపోయింది లెబనాన్ దక్షిణ భాగాన ఉన్న షియా ముస్లింలు. ఇతర ప్రధాన మత సమూహాలతో పోల్చితే అన్నిరకాలుగా బాగా వెనుకబడిన ఈ షియా ముస్లిం బాధితుల నుంచే హెజ్బుల్లా పుట్టుకొచ్చింది. సైన్యంలో కూడా మతపరమైన విభజనలు పొడచూపటంతో అంతర్యుద్ధ పరిస్థితులు (1975--1990) ఏర్పడి, మత సమూహాల మధ్య వీధిపోరాటాలు చెలరేగినప్పుడు కూడా అదేమీ చేయలేకపోయింది. ప్రతి మతం తరఫునా సాయుధబృందాలు ఏర్పాటయ్యాయి. 1982లో ఏర్పడిన హెజ్బుల్లాకు ఒకదశలో లెబనాన్ సైన్యం కంటే ఎక్కువమంది సాయుధులు ఉండేవాళ్లు. ఇరాన్ వెన్నుదన్నుగా నిలవటంతో హెజ్బుల్లా విపరీతంగా బలాన్ని సంపాదించుకుంది. హెజ్బుల్లా సాయుధ సమూహంగానే లేదు. లెబనాన్ ఎన్నికల్లో పోటీచేసి సీట్లనూ గెలుస్తోంది. 2005లో ప్రభుత్వంలోనూ చేరింది. ఇజ్రాయెల్--హెజ్బుల్లా దాడులు ప్రతిదాడులతో 1978 నుంచి ఇప్పటివరకూ 30 వేలమంది వరకూ లెబనాన్‌లో ప్రాణాలను కోల్పోయారు. 2023 అక్టోబరు నుంచి ఇప్పటివరకూ 6,500 మంది మరణించారు. ఇక అంతర్యుద్ధకాలంలో మూడోవంతు మంది ప్రజలు దేశం వదలి వెళ్లిపోయారు. మొత్తంగా విదేశాల్లో లెబనాన్ మూలాలున్న ప్రజలు 8 నుంచి 15 మిలియన్ల వరకూ ఉంటారనే అంచనాలు ఉన్నాయి. అంటే దేశంలో కంటే లెబనాన్ ప్రజలు విదేశాల్లోనే ఎక్కువగా ఉన్నట్లు లెక్క. బహుళపార్టీ ప్రజాస్వామ్యాన్ని ఎక్కువకాలం కొనసాగించిన దేశంగా లెబనాన్ పశ్చిమాసియాలో నిలబడినప్పటికీ మతం ఆధారిత కోటాల వ్యవస్థ వల్ల లౌకిక దృష్టితో కూడిన ఆధునిక పౌరసత్వ భావన బలహీనపడిపోయింది. కాలపరిమితి లేని కోటాల వ్యవస్థ సృష్టించే అనర్థాలకు లెబనాన్ ఉదాహరణగా నిలిచిపోతుంది. కులం, మతం, తెగల పేరుతో అస్తిత్వాలను బలపరిచే రాజకీయాలను అనుసరించిన తర్వాత వాటిని తొలగించుకోవటం ఎక్కడైనా కష్టమే. లెబనాన్ చెప్పే గుణపాఠం అదే!

# విద్యాభివృద్ధికి మరో అడుగు

- తాండూర్‌లో రూ.2 కోట్ల వసతి గృహానికి శంకుస్థాపన..
- విద్యార్థుల భవిష్యత్తుకు కొత్త బలం..
-వసతి సదుపాయాలపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి..
- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశం..

హంస కలం వార్త జూన్ 12 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్



విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించి వారి విద్యాభివృద్ధికి బాటలు వేయాలనే లక్ష్యంతో తాండూర్ మండల కేంద్రంలో మహాత్మ జ్యోతిబా పూలే నూతన వసతి గృహ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ వసతి గృహానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన వసతి సదుపాయాలు అందించడం ద్వారా విద్యా అవకాశాలను మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ వసతి గృహాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ భవనం పూర్తయితే విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించడంతో పాటు వారి విద్యా ప్రగతికి తోడ్పాటు నందిస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ మనోజ్ కుమార్, తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# యువశక్తికి భృతి శక్తి..

-ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.3,000 భృతి..
-ప్రభుత్వం రూ. 2,000.. ట్రస్ట్ నుంచి అదనంగా రూ.1,000..
-యువత ఉపాధి లక్ష్యంగా మంత్రి వివేక్ కీలక నిర్ణయం..
-చెన్నూరులో నర్సింగ్ శిక్షణ కేంద్రానికి హామీ..

హంస కలం వార్త జూన్ 12 మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్






యువతకు విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఎప్పుడూ ముందుండే మంత్రి వివేక్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. యువత అభ్యున్నతే లక్ష్యంగా తీసుకుని వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే సంకల్పంతో ఏటీసీల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నెలవారీ భృతి పెంపు నిర్ణయం తీసుకోవడం విశేషంగా నిలిచింది. యువత సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న మంత్రి వివేక్, శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువులు, శిక్షణను మధ్యలోనే వదిలివేయకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున నెలకు రూ.2,000 భృతి అందించడంతో పాటు, కాకా వెంకటస్వామి ట్రస్ట్ ద్వారా అదనంగా రూ.1,000 భృతి అందించనున్నట్లు ప్రకటించారు. దీంతో ప్రతి విద్యార్థికి నెలకు మొత్తం రూ. 3,000 భృతి లభించనుంది. సామాన్య కుటుంబాల నుంచి వచ్చే యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే నాణ్యమైన శిక్షణతో పాటు ఆర్థిక ప్రోత్సాహం కూడా అవసరమనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వివేక్ పేర్కొన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు పెరిగేలా అత్యాధునిక నైపుణ్య శిక్షణ అందించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. చెన్నూరు ప్రాంత యువత అవసరాలను గుర్తించి నర్సింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడం కూడా యువతలో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. యువత అభివృద్ధిని కేవలం హామీలకే పరిమితం చేయకుండా, ఆచరణాత్మక నిర్ణయాలతో ముందుకు తీసుకెళ్తున్న నాయకుడిగా మంత్రి వివేక్ గుర్తింపు పొందుతున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ తీసుకున్న ఈ నిర్ణయం యువత జీవితాల్లో కొత్త వెలుగులు నింపనుందని, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని స్థానికులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి వివేక్ ప్రకటించిన ఈ భృతి యువతకు ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా, వారి కలలను సాకారం చేసుకునే దిశగా కీలక అడుగుగా నిలవనుంది.

# ముగిసిన సైబరాబాద్ ప్రెస్ పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్--2026






-అద్భుత విజయాన్ని సాధించిన పోలీస్ హంటర్స్ జట్టు
-92 పరుగులు, 2 వికెట్లతో అద్వైత్ ఆల్‌రౌండ్ షో.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు
-180 పరుగులతో మ్యాన్ ఆఫ్ ది సిరీస్ నరేష్

( జూన్ - 12- హంస కలంవార్త )

సైబరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సైబరాబాద్ ప్రెస్ & పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్--2026 విజయవంతంగా ముగిసింది. పోలీసు సిబ్బంది మరియు మీడియా ప్రతినిధుల మధ్య స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహించారు. టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పోలీస్ హంటర్స్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పోలీస్ హంటర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 224 పరుగులు చేసింది. జట్టు తరఫున అద్వైత్ దూకుడైన బ్యాటింగ్‌తో 92 పరుగులు సాధించి జట్టు భారీ స్కోరు నమోదు చేయడంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం 225 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన క్రైమ్ వారియర్స్ జట్టు పోలీస్ హంటర్స్ బౌలర్ల ధాటికి 73 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో పోలీస్ హంటర్స్ జట్టు ఘన విజయం సాధించి టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన అద్వైత్ 92 పరుగులు చేయడంతో పాటు 2 వికెట్లు కూడా తీసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నారు. టోర్నమెంట్ మొత్తం 180 పరుగులు సాధించిన పోలీస్ హంటర్స్ ప్లేయర్ నరేష్ కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ విజేతలకు ట్రోఫీలు, వ్యక్తిగత అవార్డులు అందజేసి అభినందించారు. క్రీడా స్ఫూర్తితో పాల్గొన్న అన్ని జట్లను ప్రశంసించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., మాట్లాడుతూ, పోలీసు శాఖ ఉద్యోగం అయినా, మీడియా ఉద్యోగం అయినా నిరంతర ఒత్తిడితో కూడుకున్నవేనని, రాత్రి వేళల్లో కూడా విధుల నిర్వర్తిస్తూ ఉంటారని అన్నారు. అటువంటి పరిస్థితుల్లో పనిచేస్తున్న రెండు వర్గాల మధ్య పరస్పర అవగాహన, స్నేహపూర్వక వాతావరణం మరింత బలోపేతం కావాలనే ఉద్దేశంతో ఈ ప్రెస్ & పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్‌ను నిర్వహించామని తెలిపారు. మూడు రోజుల పాటు సైబరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో 10 జట్లతో నిర్వహించిన ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి కృషి చేసిన అధికారులు, నిర్వాహకులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరినీ హృదయపూర్వకంగా అభినందించారు. మీడియా ప్రతినిధుల కోరిక మేరకే ఈ క్రికెట్ లీగ్‌ను నిర్వహించామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తూ బ్యాడ్మింటన్ వంటి ఇతర క్రీడా పోటీలను కూడా నిర్వహిస్తామని సీపీ తెలిపారు. పోలీసు--మీడియా సంబంధాలను మరింత బలోపేతం చేసే వేదికగా ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీ డా. ఎం. రమేష్‌తో పాటు అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, హెడ్ క్వార్టర్ డీసీపీ సంజీవ్, సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీలు హనుమంతరావు, షమీర్, ఆర్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



( జూన్ - 12- హంస కలంవార్త )

ఈ నెల 13వ తేదీన జిల్లాలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయాన్ని డి.సి.పి.ఎ.భాస్కర్,జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వి.రాములు, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గిరిజన సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొట్నాక తిరుపతి,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్,దండేపల్లి మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్,లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్, ఆలయ ఈ.ఓ. శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఈ నెల 13వ తేదీన ఉదయం జిల్లాలోని దండేపల్లి మండలం శ్రీ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం పునర్నిర్మాణం, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో సింగరేణిలో వైద్య పరంగా విధులు నిర్వహించలేని ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తారని, సాయంత్రం శ్రీరాంపూర్ ఏరియాలో ఓపెన్ కాస్ట్ గనులను పరిశీలిస్తారని, అనంతరం మంచిర్యాల పట్టణంలో శ్రీ విశ్వనాథ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయ వంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.మంచిర్యాల పట్టణంలోని వేంపల్లి ప్రాంతంలో గల పద్మావతి ఫంక్షన్ హాల్ లో ఏర్పాట్లను డి.సి.పి., మంచిర్యాల శాసనసభ్యులు,ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి పరిశీలించారు. తదనంతరం మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్ హాల్ ను సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నీట్, ఐఐటి పరీక్షల్లో అవకతవకలపై ఎన్.ఎస్.యు.ఐ ఆందోళన.

( జూన్ - 12- హంస కలంవార్త )



నీట్, ఐఐటి పరీక్షల్లో తలెత్తిన అవకతవకలను నిరసిస్తూ నగరంలో ఎన్. ఎస్. యు.ఐ అధ్వ ర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ చౌక్ వద్ద ఎన్ఎస్‌యుఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ప్రతిష్ఠాత్మక ఐఐటి, నీట్ పరీక్షలలో అవకతవకలు జరగడం దేశ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని, అన్ని పరీక్షల్లో అవకతవకలు జరగడం, నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించడం విద్యా వ్యవస్థకు సిగ్గుచేటని ఆయన ఆరోపించారు. నీట్ పరీక్షను రద్దు చేయడం చాలా అవమానకరమని, ఇటీవల చాలామంది యువకులు, విద్యార్థులు జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో సైతం నీట్, ఐఐటి పరీక్షల రద్దు పట్ల నిర్వహించిన ధర్నా కార్యక్రమం ప్రభుత్వానికి గుణపాఠం లాంటిదన్నారు.సాంకేతిక సమస్యలైన డేటా లభించకపోవడం, సర్వర్ మొరాయించడం, సాంకేతిక లోపాలు అధికంగా ఉండడం, సరైన పర్యవేక్షణ లోపించడం మన విద్యా విధానానికి అడ్డంకిగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చైనా దేశంలో పరీక్ష పేపర్లు లీక్ చేసిన వారికి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తారని గుర్తుచేశారు.విద్యార్థులు పేపర్ లీక్ కాలేదని వాదిస్తున్నప్పటికీ పరీక్షలు మళ్ళీ నిర్వహించాలని అనుకోవడం అవమానకరమని చెప్పారు. ఈ సంవత్సరం ఐఐటి రూర్కీ వారు ఐఐటి అడ్వాన్స్డ్ పరీక్ష నిర్వహించారని గుర్తు చేశారు.పరీక్షల నిర్వహణలో తప్పులు ఉన్నాయని, అవకతవకలు చోటు చేసుకున్నాయని విచారం వ్యక్తం చేస్తూ, ఐఐటి రూర్కీ సంస్థకు ప్రశ్నపత్రాలను సిద్ధం చేసే బాధ్యత నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. చరిత్రలో మొట్టమొదటిసారిగా ఐఐటి అడ్వాన్స్డ్ పేపర్ కూడా లీక్ అవ్వడం చాలా బాధాకరమన్నారు. అడ్వాన్స్డ్ పరీక్ష చాలా కీలకమైనదని, ప్రపంచంలో మన విద్యా వ్యవస్థకు ఎంతో గౌరవం ఉందని, కానీ ఈ పేపర్ లీకేజీ వల్ల ఆ గౌరవం క్షీణించిందని ఆవేదన వ్యక్తం చేశారు.అభివృద్ధి పథంలో పయనిస్తున్న భారతదేశంలో విద్యా వ్యవస్థ కుప్పకూలడం విచారకరమని, ఇది మన అభివృద్ధిని సైతం ప్రభావితం చేస్తుందని వారు చెప్పారు.ప్రధానమంత్రి తక్షణమే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుండి తొలగించడమే కాకుండా, లోక్‌సభ సభ్యత్వాన్ని సైతం రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా జాతీయ స్థాయి పరీక్షలను సజావుగా నిర్వహించాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్ నాయక్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత రెడ్డి, చింతల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కిమ్ ఫహద్,

## పర్యావరణ పరిరక్షణకే 'గ్రీన్ ఎనర్జీ' ..మంత్రి పొంగులేటి

-పాలేరు పరిధిలో రూ.37.38 కోట్లతో విద్యుత్ పనులు..

-రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు..

-తిరుమలాయపాలెంలో సోలార్ ప్లాంట్‌కు శంకుస్థాపన..



( జూన్ - 12- హంస కలంవార్త )

తిరుమలాయపాలెం : పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 0.8 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్, విద్యుత్ నియంత్రికల (ట్రాన్స్‌ఫార్మర్ల) మరమ్మత్తు కేంద్రానికి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యుత్ రంగ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నియోజకవర్గ పరిధిలో రూ.37.38 కోట్లతో విద్యుత్ సరఫరా మెరుగుదలకు పనులు చేపట్టామని, రూ.9 కోట్ల వ్యయంతో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణాలు సాగుతున్నాయని వివరించారు. దశాబ్దాలుగా ఇళ్లపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఒకప్పుడు కరెంట్ కష్టాలతో రాత్రివేళల్లో పొలాలకెళ్లి రైతులు పాముకాట్లకు గురైన పరిస్థితులు ఉండేవని, నాటి ఉచిత విద్యుత్ స్ఫూర్తితోనే ప్రస్తుత ప్రభుత్వం రైతులకు నాణ్యమైన కరెంట్ అందిస్తోందని గుర్తుచేశారు.

**-అర్హులందరికీ సొంతింటి కల..**

అనంతరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అదనంగా మరో 2 వేల ఇళ్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా, కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు.


**-రైతాంగానికి భరోసా..**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా సంక్షేమ పథకాలను ఆపడం లేదని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, రైతు భరోసా సాయాన్ని ఎకరాకు రూ.12 వేలకు పెంచామన్నారు. దేశంలోనే రికార్డు స్థాయిలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తూ కొనుగోలు చేశామని, తడిసిన ధాన్యాన్ని సైతం సేకరించి రైతులకు అండగా నిలిచామని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. గడిచిన ఏడాది కాలంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదల వైద్యం కోసం రూ.1,034 కోట్లు వెచ్చించామని, నిరుద్యోగుల కోసం 72 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టామని చెప్పారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్నందున, రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనల మేరకే పంటలు సాగు చేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారీ, జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం "దిశా" కమిటీలో సర్పంచ్ లకు పెద్దపీట

-క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండేలా ప్రాధాన్యమిస్తూ ఎంపీ రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవ..

( జూన్ - 12- హంస కలంవార్త )



భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా అభివృద్ధిలో స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశా) కమిటీకి సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఐదుగురు సర్పంచ్ లకు చోటు కల్పించారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో పర్యవేక్షణ ఉండేలా వీరి నియామకంలో ప్రత్యేక చొరవ ప్రదర్శించారు.

**-దిశా కమిటీ సభ్యులు వీరే..**

భుక్యా సునీత (సర్వారం, సుజాతనగర్ మండలం), బానోత్ శారద (రేపల్లెవాడ, ఇల్లందు మండలం), కోర్సరాజేష్ (తిరుమలకుంట,అశ్వారావుపేట మండలం), కల్లూరి ఆదినారాయణ (నారాయణరావుపేట, దుమ్ముగూడెం మండలం), మద్దెల సమ్మయ్య (పొట్లపల్లి, పినపాక మండలం).

**-అణగారిన వర్గాలకు అవకాశాలు..**

ఐదుగురు గ్రామ పంచాయతీ సర్పంచులకు చోటు దక్కగా..ఇందులో ఇద్దరు మహిళా సర్పంచులు ఉండటం విశేషం. గ్రామీణ స్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించాలన్న ఎంపీ సంకల్పానికి ఈ నియామకాలు నిదర్శనంగా నిలుస్తున్నాయంటూ..జిల్లాలోని పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ

-డీజిల్ పొదుపుపై ఉద్యోగుల్లో సామాజిక బాధ్యత పెరగాలి"

-డీజిల్ ఆదా కోసం సాంకేతిక పద్ధతులతో మైలేజీ పెంపు : సంస్థ వీసీ ఎండీ వై. నాగిరెడ్డి

( జూన్ - 12- హంస కలంవార్త )




ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభం, నిరంతరం పెరుగుతున్న డీజిల్ ధరల నేపథ్యంలో సంస్థపై పడుతున్న భారీ నిర్వహణ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని టీజీఎస్ ఆర్టీసీ వీసీ & ఎండీ (వీసీ & ఎండీ వై.) నాగిరెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ 'బస్ భవన్'లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "డీజిల్ నిర్వహణ -- అవగాహన సదస్సు" లో ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఇంధన ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఇది రవాణా రంగంపై, ముఖ్యంగా ఆర్టీసీపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక భారాన్ని సమర్థవంతంగా అధిగమించాలంటే డీజిల్ వినియోగాన్ని క్రమబద్ధీకరించడం, ప్రతి లీటరు ఇంధనాన్ని పొదుపుగా వాడుతూ వృథాను అరికట్టడం ఒక్కటే సరైన మార్గమని ఎండీ స్పష్టం చేశారు. ఇందుకోసం డిపోల స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని గరిష్టంగా ఉపయోగించుకోవాలని, వాహనాల ఫిట్‌నెస్‌తో పాటు ఉత్తమ నిర్వహణ పద్ధతులను నిరంతరం అలవర్చుకోవాలని అధికారులకు, సాంకేతిక సిబ్బందికి సూచించారు. కేవలం ఇదొక విధి నిర్వహణ మాత్రమే కాదని, ప్రతి ఉద్యోగికి ఇంధన పొదుపుపై ఒక సామాజిక బాధ్యత ఉండాలని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి డీజిల్‌ను ఆదా చేయడం ద్వారా సంస్థను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా మన వంతు సహకారం అందించినవారమవుతామని పేర్కొ న్నారు. ఈ అవగాహన సదస్సులో ఈడీ సిహెచ్. వెంకన్న, ఫైనాన్సియల్ అడ్వైజర్ విజ యపుష్ప, బీపీసీఎల్ తెలంగాణ హెడ్ లక్ష్మీ లాల్ చౌహాన్ , మార్కెటింగ్ మేనేజర్ రఘునాథరావ్, ఆర్టీసీ సీసీఎస్ ప్రభులత, పలువురు డిప్యూటీ ఆర్ఎం లు, డిపో మేనేజర్లు పాల్గొన్నారు. డెపోలలో ని గ్రౌండ్ ట్యాంక్ ల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. అదేవిధంగా బస్సుల డీజిల్ మైలేజీని (KMPL) గణనీయంగా పెంచడానికి, గ్యారేజ్ పరిధిలో సాంకేతిక లోపాలను సకాలంలో గుర్తించి నివారించడానికి తీసుకోవాల్సిన వివిధ రకాల జాగ్రత్తలపై ఈ సందర్భంగా నిపుణులు సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

- జిల్లా ఎస్పీ నరసింహా ఐపీఎస్

( జూన్ - 12- హంస కలంవార్త )



యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, సమాజానికి సేవ చేసే వనరుగా ఎదగాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చివ్వెంల మండల పరిధిలోని దురాజుపల్లి గ్రామ సమీపంలోని ప్రతిష్ట ఫార్మసీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉందని, ఇందుకోసం పోలీస్ శాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం పనిచేస్తోందన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, అలాంటి యువశక్తి మాదకద్రవ్యాలకు బానిసైతే కుటుంబాలతో పాటు దేశ ప్రగతికి కూడా తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం సమాజాన్ని పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యల్లో డ్రగ్స్ ఒకటిగా మారిందని పేర్కొన్న ఆయన, మాదకద్రవ్యాల వ్యసనంతో యువత తమ బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని తెలిపారు. డ్రగ్స్‌కు బానిసలైన వారు శారీరక, మానసిక సమస్యలతో పాటు కుటుంబాలను కూడా సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారని చెప్పారు. యువత కష్టపడే వయస్సులో వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని, మంచి స్నేహితులను, మంచి పుస్తకాలను ఎంచుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.జిల్లాలో ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. వ్యసనాలకు బానిసైన వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు కూడా సమాజానికి సవాళ్లుగా మారాయని ఎస్పీ పేర్కొన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అజాగ్రత్త వల్ల ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అపరిచితులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం ఇవ్వవద్దని సూచించారు. తక్కువ వడ్డీ రుణాలు, బహుమతులు, ప్రభుత్వ పథకాల పేరుతో వచ్చే సందేశాలను నమ్మి డబ్బులు పంపవద్దని ప్రజలకు సూచించారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థులు డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తామని, వ్యసనాలకు గురైన వారిలో పరివర్తన తీసుకురావడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, చివ్వెంల ఎస్ఐ మహేష్, కనకరత్నం, బరోసా ఎస్ఐ మౌనిక, షీ టీమ్ ఎస్ఐ నీలిమ, పోలీసు సిబ్బంది, కళాశాల యాజమాన్యం డాక్టర్ రామకృష్ణ, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

-రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి..

-ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత..

-ప్రతి పేద కుటుంబ సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది..

-ఏదులాపురంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల క్రింద 76 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి..

( జూన్ - 12- హంస కలంవార్త )



ఏదులాపురం: పేదల సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపల్ పరిధిలోని రాంలీలా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల క్రింద 76 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. లాగే ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయడం ద్వారా వారి సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి పలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి తెలిపారు. పేదల సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ వినయందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగ్ కాలేజ్ ను సందర్శించిన కలెక్టర్

**-విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్వాహకులకు ఆదేశం**

( జూన్ - 12- హంస కలంవార్త )



మాక్లూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సందర్శించారు. కాలేజీ ఆవరణను పరిశీలించిన సందర్భంగా ప్రహరీ లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నర్సింగ్ కాలేజీ వద్ద, పరిసర ప్రాంతాలలో పోలీసులు పెట్రోలింగ్ చేసేలా చూడాలని అన్నారు. తుది దశలో కొనసాగుతున్న నిర్మాణ పనుల నాణ్యతను తనిఖీ చేసి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయించాలని, విద్యార్థినులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో భేటీ అయ్యారు. విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లెట్లు, బహుమతులను అందించారు. నర్సింగ్ కోర్సు ఎంతో డిమాండ్ కలిగిన చక్కటి కోర్సు అని, ఏకాగ్రతతో ఇష్టంగా చదువుకోవాలని హితవు పలికారు. కరోనా సమయంలో పారా మెడికల్ సిబ్బంది అందించిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. సేవా భావంతో కూడిన నర్సింగ్ కోర్సు వల్ల ఉద్యోగ అవకాశాలతో పాటు ఆకర్షణీయమైన వేతనాలతో విరివిగా ఉపాధికి లభించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా వంటికి ఒకింత దూరంగా ఉండాలని, ఉన్నత భవిష్యత్తు కోసం ప్రణాళికతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వారి కలలను నిజం చేయాలని, అధ్యాపకులకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. కాగా, వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని విద్యార్థినులకు జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏవైనా అనుకోని ఘటనలు జరిగితే సఖీ వన్ స్టాప్ సెంటర్ ను సంప్రదిస్తే, వారు అన్ని విధాలుగా వెన్నుదన్నుగా నిలుస్తూ న్యాయం జరిగేలా కృషి చేస్తారని, మీ వ్యక్తిగత గుర్తింపు బయటపడకుండా గోప్యత పాటిస్తారని కలెక్టర్ తెలిపారు. బాలికల రక్షణకు, వారి ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించకూడదని, బంధువులు అయినా సరే లోనికి రాకుండా చూడాలని నిర్వాహకులను, సిబ్బందిని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ శేఖర్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ భూలక్ష్మి తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు

**-రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్**

( జూన్ - 12- హంస కలంవార్త )



రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటిస్తే, ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అన్నారు. ఈ దిశగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా చైతన్యపర్చేందుకు కృషి చేయాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. పోలీస్, నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి, రవాణా శాఖ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్యారోగ్యం, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో పాటు రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్ ప్రాంతాల గురించి, ప్రమాదాలకు గల కారణాలపై సమావేశంలో చర్చించి పలు సూచనలు చేశారు. ప్రమాదాలను నిలువరించేందుకు ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యల గురించి అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు మార్గనిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం లైన్ డిపార్ట్ మెంట్స్ కు చెందిన అధికారులు పరస్పర సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలన్నారు. వరి కోతల సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ విద్యార్థులకు, వాహన డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన పెంపొందేలా విరివిగా ప్రచారం నిర్వ హించాలని అన్నారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించబడిన ప్రదేశాలలో తక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా, అందుకు గల కారణాలపై పూర్తిస్థాయిలో పరిశీలన జరపాలని, తద్వారా అలాంటి చోట్ల మరోమారు ప్రమాదాలు జరుగకుండా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రమాదాలకు కారణం అవుతున్న ఆక్రమణలను సంబంధిత శాఖలు సమన్వయంతో తొలగించాలని సూచించారు. పీ.ఎం రహే వీర్, పీ.ఎం రాహత్ కార్యక్రమాల గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్ రావు, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, ఆర్ అండ్ బీ ఈ.ఈ అజ్మీర, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఎన్.ఐ.సీ అధికారి మధు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్, ఈ-దార్ మేనేజర్ హర్ష, రెడ్ క్రాస్ ప్రతినిధి బుస్స ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సద్ది తెచ్చుకుని స్థానికులతో టిఫిన్ బైఠక్ లో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్

( జూన్ - 12- హంస కలంవార్త )



కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం హుస్నాబాద్ నియోజకవర్గం చిగురుమామిడి మండలం రేకొండ గ్రామ ఉన్నత పాఠశాలను సందర్శించారు. స్వచ్ఛ పాఠశాల కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి పాఠశాల ఆవరణలో టిఫిన్ బైఠక్ నిర్వహించారు. అక్కడికి వచ్చిన గ్రామస్తులు, కార్యకర్తలంతా తమ వెంట సద్ది తెచ్చుకుని రాగా బండి సంజయ్ సైతం స్వయంగా ఇంటి నుండి తెచ్చుకున్న టిఫిన్ క్యారియన్ ఓపెన్ చేసి వారితో కలిసి అల్పాహారం తిన్నారు. ఈ సందర్భంగా రేకొండ స్కూల్ తరగతులను శుభ్రం చేసే అంశంపై చర్చించారు. పేదల చదవుల నిలయమైన ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుంటూ శుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యతని చెప్పారు. అందులో భాగంగా మోదీ పిలుపు మేరకు రాజకీయాలకు అతీతంగా స్కూల్ ను క్లీన్ చేయాలని కోరారు. ఈనెల 16న ప్రతి గ్రామంలో పిల్లలంతా బడిలో చేరాలంటూ ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎంపీ అయ్యాక తాను సమాజసేవకే ప్రాధాన్యతనిస్తున్నానని వెల్లడించారు. ఈ సందర్భంగా స్కూల్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు డైనింగ్ సౌకర్యం లేదని, పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల సమస్య ఉందని ఈ సందర్భంగా టీచర్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల డైనింగ్ కోసం రూ.5 లక్షల సాయం చేస్తానని హామీ ఇచ్చారు. అట్లాగే ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి, కుల సంఘాల భవన నిర్మాణానికి రూ.20 లక్షల సాయం చేస్తానని తెలిపారు. తొలి విడతగా రూ.10 లక్షలు అందిస్తానని హామీ ఇచ్చారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన రేకొండ స్కూల్ విద్యార్థులను అభినందించడంతోపాటు వారితో కలిసి ఫోటో దిగారు. ఈసారి కూడా ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థుందరికీ ఉచితంగా సైకిళ్లు అందిస్తానని ప్రకటించారు. మోదీ పాలనా విజయాల బుక్ లెట్లను ఈ సందర్భంగా హెడ్మాస్టర్ కు అందించారు. మోదీ 12 ఏళ్ల పాలనా విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు మేరకు శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని దాదాపు అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో బీజేపీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి టిఫిన్ బైఠక్ నిర్వహించారు. ఎవరికి వారే తమ వెంట అల్పాహారం క్యారియర్ లను తెచ్చుకుని పాఠశాల ఆవరణలో కూర్చుని తిన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల తరగతులను పరిశీలించి "స్వచ్ఛ పాఠశాల"లో భాగంగా వాటిని క్లీన్ చేసేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకున్నారు.

# దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం

**-రూ.50 వేల చెక్కు అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**



( జూన్ - 12- హంస కలంవార్త )

ఇద్దరు దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం అందజేశారు.బోయినపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కళ్యాణం కొమురవ్వకు నలుగురు పిల్లలు.వారిలో ఇద్దరు దివ్యాంగులు.దివ్యాంగురాలైన సాగరిక,దివ్యాంగుడైన వేణు అనారోగ్యానికి గురయ్యారు.వారికి ప్రభుత్వ,ప్రైవేటు హాస్పిటల్లో వైద్యం చేయించారు.కొమురవ్వ భర్త గల్ఫ్ కు వెళ్లి అక్కడే మరణించారు.ఆమెకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ను కలిసి తమ ఇబ్బందులను విన్నవించారు.పిల్లలను చూసుకోవడం కోసం తాను ఇంటికే పరిమితమై పోయినది.కూలి పనులకు సైతం కూడా వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారు.జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి జిల్లా సంక్షేమ అధికారితో విచారణ చేయించి వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు.దీంతో వారికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం రూ.50 వేల చెక్కును అందజేశారు.భవిష్యత్తులో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని జిల్లా సంక్షేమ అధికారి పీ.లక్ష్మీరాజంను జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు.తమ పిల్లలకు ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్ కు కొమురవ్వ కృతజ్ఞతలు తెలియజేశారు.

# 190 జీవో ను వెంటనే అమలు చేయాలి

**-317 జీవో బాధితులైన టీచర్లు, ఉద్యోగులకు వెంటనే న్యాయం చేయాలి**

**-తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



( జూన్ - 12- హంస కలంవార్త )

జీవో నంబర్ 317 బాధితులైన టీచర్లు, ఉద్యోగులకు వెంటనే న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన మధ్యంతర జీవో 190 ని వెంటనే అమలు చేయాలన్నారు. వెంటనే 190 జీవో అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**-190 జీవో ఎందుకు అమలు చేయటం లేదు?**

ఎన్నికలకు ముందు 317 జీవో బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ...అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని మోసం చేస్తోందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ నిర్ణయం తీసుకోవాలన్నకూడా ఈ ప్రభుత్వానికి గుండె ధైర్యం లేని పరిస్థితి కనిపిస్తుందని చెప్పారు. ఉద్యమకారులు, ఉద్యోగులకు సంబంధించిన అంశాల్లో కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. 317 జీవో బాధితులకు న్యాయం చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆ విషయంలో ముందడుగు వేయటం లేదో చెప్పాలన్నారు. 317 బాధితులైన టీచర్లు, ఉద్యోగులకు స్థానికత ఆధారంగా బదిలీలు చేస్తామని చెప్పి దామోదర రాజనర్సింహా, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ వేశారని...ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇచ్చిన 190 జీవో ను ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. 317 జీవో బాధితులైన టీచర్లకు స్థానికత ఆధారంగా బదిలీలు చేస్తామని చెప్పారని...అవసరమైతే సూపర్ న్యూమరీ ఉద్యోగాలు కూడా సృష్టిస్తామని హామీ ఇచ్చారని కవిత గుర్తు చేశారు. కానీ 190 జీవో తెచ్చి తొమ్మిది నెలలు గడిచినా దానిని అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఎవరి కోసం, ఏ పైరవీ కోసం ఈ జీవోను అమలు చేయటం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. 190 జీవో గడువే మూడేళ్లు ఉందని ఇప్పటికే 9 నెలలు గడిచిపోయిందని ఇంకెప్పుడూ అమలు చేస్తారని ప్రశ్నించారు.

**-ఉద్యోగుల కోసం మేము పోరాడుతాం**

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి కారణంగా టీచర్లు, ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని కవిత అన్నారు. 317 జీవో కారణంగా వారంత స్థానికత కోల్పోయారని చెప్పారు. జీవో 25 రేషనలైజేషన్ తో సంబంధం లేకుండా వెంటనే 190 జీవోను అమలు చేయాలని కవిత కోరారు. అవసరమైతే టీచర్ల కోసం సూపర్ న్యూమరీ ఉద్యోగాలు క్రియేట్ చేయాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చేస్తోన్న తాత్సారంపై ఉద్యోగ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని కవిత పిలుపునిచ్చారు. టీచర్లు, ఉద్యోగుల హక్కుల కోసం వారి తరఫున తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని కవిత చెప్పారు. వెంటనే 190 జీవో అమలు పై చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని కవిత హెచ్చరించారు.

# క్రీడలు

## అంతర్జాతీయ క్రికెట్‌కు విలియమ్సన్ వీడ్కోలు

### - ఎందుకీ షాకింగ్ నిర్ణయం..!



న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. క్లాస్ ఆటతో ఫ్యాబ్-4లో ఒకడిగా పేరొందిన విలియమ్సన్ ఉన్నట్టుండి తన సుదీర్ఘ కెరీర్‌ను ముగిస్తున్నానని ప్రకటించాడు. తన సొగసైన ఆటతో, సమర్థ నాయకత్వంతో కివీస్ క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన ఈ లెజెండరీ ఆటగాడు ఇంగ్లండ్ సిరీస్ మధ్యలోనే రిటైర్మెంట్ ప్రకటించడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పదహారేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన కేన్ విలియమ్సన్ హఠాత్తుగా వీడ్కోలు చెప్పేశాడు. ఇంగ్లండ్‌తో మూడు టెస్టుల సిరీస్ మధ్యలోనే ఈ దిగ్గజం నేను ఇక ఆడలేను అంటూ ఆటకు అల్విదా పలికాడు. లార్డ్స్ టెస్టులో ఆతిథ్య జట్టు చేతిలో ఘోర పరాభవంతో బాధ పడిన విలియమ్సన్ ఈ కఠిన నిర్ణయానికి వచ్చాడు. 'వీడ్కోలుపై నేను కొన్నిసార్లు ఆలోచించాను. అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు నేను ఎంతో ఆకలితో ఉండేవాడిని. న్యూజిలాండ్‌కు ఆడిన ప్రతి మ్యాచ్‌లో నా శక్తినంతా ధారపోసినందుకు చాలా గర్వంగా ఉంది. క్రికెట్‌లో అడుగుపెట్టిన కేన్ విలియమ్సన్ హఠాత్తుగా వీడ్కోలు చెప్పేశాడు. ఇంగ్లండ్‌తో మూడు టెస్టుల సిరీస్ మధ్యలోనే ఈ దిగ్గజం నేను ఇక ఆడలేను అంటూ ఆటకు అల్విదా పలికాడు. లార్డ్స్ టెస్టులో ఆతిథ్య జట్టు చేతిలో ఘోర పరాభవంతో బాధ పడిన విలియమ్సన్ ఈ కఠిన నిర్ణయానికి మునపటిలా ఆడలేనప్పుడు ఆటలో కొనసాగడం సరిగా అనిపించలేదు. స్వచ్ఛందంగా క్రికెట్‌కు వీడ్కోలు పలకడాన్ని అదృష్టంగా భావిస్తున్నా' అని విలియమ్సన్ వెల్లడించాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్ ఫ్యాబ్ 4లో తన జోరు చూపించిన విలియమ్సన్.. విరాట్ కోహ్లీ, జో రూట్, స్టీవ్ స్మిత్‌లతో పోటీగా క్రేజ్ సంపాదించుకున్నాడు. 2021లో న్యూజిలాండ్‌ను ప్రపంచ టెస్టు ఛాంపియన్‌గా నిలిపాడు. అంతేనా..న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు.ఫ్యాబ్-4లో ఒకడిగా పేరొందిన విలియమ్సన్ ఉన్నట్టుండి తన సుదీర్ఘ కెరీర్‌ను ముగిస్తున్నానని ప్రకటించాడు. 2019లో బ్లాక్ క్యాప్స్‌ను వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ చేర్చిన విలియమ్సన్.. అంపైర్ నిర్ణయంతో కప్ చేజారినా కోట్లాది మంది మనసులు గెలుచుకున్నాడు. నిరుడు నవంబర్‌లో అంతర్జాతీయ టీ20లకు గుడ్ బై చెప్పిన కేన్ మామ.. ఇప్పుడు తనకెంతో ఇష్టమైన టెస్టు, వన్డే ఫార్మాట్ల నుంచి కూడా వైదొలిగాడు. ఐపీఎల్‌లోనూ తనదైన శైలిలో మెరుపులు మెరిపించిన కేన్ మామ.. సన్ రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యాన్ని వహించాడు.

## భారత క్రికెట్ ఆస్తి వైభవ్



దక్షిణాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్ ఐపీఎల్ 19వ సీజన్‌లో రికార్డుల మోత మోగించిన వైభవ్ సూర్యవంశీని ఆకాశానికెత్తేశాడు. పదిహేనేళ్ల వైభవ్ ఆటకు ఫిదా అయిన స్టెయిన్ అతడు భారత క్రికెట్ ఆస్తి అని, అతడు గొప్ప శిఖరాలకు చేరుతాడని అభిప్రాయం వ్యక్తం చేశాడు. అంతేకాదు ఇండియన్ క్రికెట్‌లో దిగ్గజాలుగా వెలుగొందుతున్న సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీల ఘనతలను వైభవ్ అధిగమిస్తాడని సఫారీ లెజెండ్ అన్నాడు. వీరకొట్టుడే మంత్రగా ఐపీఎల్‌లో.. అంతకుముందు అండర్ -19 ప్రపంచకప్‌లో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లోనూ తన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నాడు. ఐర్లాండ్ పర్యటనతో ప్రపంచ క్రికెట్‌లో తన ఆగమనాన్ని గొప్పగా చాటాలని వైభవ్ ఉవ్విళ్లూరుతున్నాడు. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్ భారత క్రికెట్‌లో వైభవ్ విజయవంతం అవుతాడని అంటున్నాడు. మేటి ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలు సాధించిన రికార్డుల కంటే ఎక్కువే సూర్యవంశీ ఖాతాలో చేరుతాడని స్టెయిన్ చెబుతున్నాడు. స్వదేశంలో జరుగనున్న ఎస్ఏ20 ఐదో సీజన్ సన్నాహకాల గురించిన చర్చ సందర్భంగా స్టెయిన్ మాట్లాడుతూ.. 'అండర్ 15, అండర్ 19 క్రికెట్‌లో ప్రతిభావంతులు వెలుగులోకి వస్తున్నారు. వీరిలో వైభవ్ సూర్యవంశీ చాలా ప్రత్యేకమైన క్రికెటర్. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న చాలామంది కంటే అతడు ఎంతో ఉత్తమం. అద్భుతమైన ఈ కుర్రాడు భారత క్రికెట్‌కు ఆస్తి' అని పేర్కొన్న స్టెయిన్.. వైభవ్‌ను జాగ్రత్తగా చూసుకోవడం బీసీసీఐకి ఓ సవాల్ అని హెచ్చరించాడు. కోహ్లీ, సచిన్ ఘనతలను అధిగమిస్తాడు..! : డేల్ స్టెయిన్ దక్షిణాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్ ఐపీఎల్ 19వ సీజన్‌లో రికార్డుల మోత మోగించిన వైభవ్ సూర్యవంశీ ని ఆకాశానికెత్తేశాడు. "విధ్వంసక ఆటతో ప్రపంచ స్థాయి బౌలర్లను వణికిస్తున్న వైభవ్‌ను భారత బోర్డు ఎలా చూసుకుంటుంది? అనేది నేను జాగ్రత్తగా గమనిస్తాను. అతడి బాధ్యత తీసుకుంటేనే భవిష్యత్‌లో గొప్ప ఘనతలు సాధిస్తాడు. అదే సమయంలో అతడిపై ఒత్తిడి పడకుండా చూసుకోకున్నా.. సరైన దిశానిర్దేశం చేయకున్నా అతడిని భారత క్రికెట్ కోల్పోయే ప్రమాదముంది. వైభవ్ బంతిని అద్భుతంగా బాదుతున్నాడు. ఇప్పుడు మా దేశంలోని ఏ పదిహేనేళ్ల కుర్రాడు కూడా అతడిలా ఆడడం లేదు. కానీ, నా దృష్టిలో వైభవ్ దూకుడుకు రబడ అడ్డుకట్ట వేశాడు. అతడికి షార్ట్ బంతులు వేయడమే సరైంది' అని స్టెయిన్ అన్నాడు.

## చెక్ రిపబ్లిక్‌కు షాకిచ్చిన దక్షిణకొరియా



2-1 గోల్స్ తేడాతో విజయం ఫిఫా వరల్డ్‌కప్ గ్రూపు ఏ మ్యాచ్‌లో చెక్ రిపబ్లిక్‌కు షాక్ ఇచ్చింది దక్షిణ కొరియా. 2-1 గోల్స్ తేడాతో దక్షిణ కొరియా విజయం సాధించింది. ఆ జట్టు తరపున హవంగ్ ఇన్ బియోమ్, ఓహ్ హేయన్ గుయు గోల్స్ చేశారు. ఇక చెక్ రిపబ్లిక్ తరపున ఎల్ క్రేజ్‌సీ గోల్ చేశాడు.సెకండ్ హాఫ్ ఆరంభంలో చెక్ రిపబ్లిక్ ప్లేయర్ ఎల్ క్రేజ్‌సీ ఆట 59వ నిమిషంలో గోల్ చేశాడు. మ్యాచ్‌లో చెక్ రిపబ్లిక్ విజయం సాధిస్తుందనుకున్న సమయంలో.. దక్షిణకొరియా అనూహ్యంగా కోలుకున్నది.

# బిజినెస్

## ఒక్కసారి ఫుల్ చార్జి చేస్తే 39 గంటలు నాన్‌స్టాప్ కాల్స్ మాట్లాడొచ్చు



ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ టెక్నో స్మార్ట్‌ఫోన్‌ను భారత మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. గత ఏడాది వచ్చిన పోవా 7కు అప్‌గ్రేడెడ్ వెర్షన్‌గా తీసుకొచ్చిన ఈ మొబైల్ భారీ బ్యాటరీ, హై రిఫ్రెష్ రేట్ డిస్‌ప్ల, శక్తివంతమైన ప్రాసెసర్ వంటి ఫీచర్లతో స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను ఆకట్టుకుంటుంది. భారత్‌లో పోవా 8 రెండు వేరియంట్లలో అందుబాటులోకి వచ్చింది. 6జీబీ ర్యామ్+128జీబీ స్టోరేజ్ వేరియంట్ ధరను రూ. 29,999గా నిర్ణయించారు. 8జీబీ ర్యామ్+128జీబీ స్టోరేజ్ వేరియంట్ ధరను రూ. 31,999గా ఖరారు చేశారు. ఈ మొబైల్ 16 బిట్ వైట్, ప్లాస్మా ఆరెంజ్, టెర్మినల్ గ్రీన్ రంగుల్లో అందుబాటులో ఉంది. డిస్‌ప్లే పనితీరు డిస్‌ప్లే విషయానికి వస్తే పోవా 8 స్మార్ట్‌ఫోన్‌లో 6.76 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ఐపీఎస్ స్క్రీన్‌ను అందించారు. 1080li2344 పిక్సెల్ రిజల్యూషన్‌తో పాటు 144ఎఓ రీఫ్రెష్ రేట్‌ను కలిగి ఉండటం వల్ల గేమింగ్, వీడియో స్ట్రీమింగ్‌ను మరింత స్మూత్‌గా ఆస్వాదించవచ్చు. 95 నిట్స్ వరకు బ్రైట్‌నెస్, 1500ఎఓ టచ్ శాంప్లింగ్ రేట్, 91.29 శాతం స్క్రీన్ టు బాడీ రేషియో వంటి ఫీచర్లు కూడా ఇందులో ఉన్నాయి. పనితీరు విషయానికి వస్తే ఈ మొబైల్‌లో 6 నానోమీటర్ టెక్నాలజీ ఆధారంగా రూపొందించిన మీడియాటెక్ డైమెన్సిటీ 7100 ప్రాసెసర్‌ను అమర్చారు. జతకట్టిన ఈ చిప్‌సెట్ గేమింగ్, మల్టీటాస్కింగ్‌కు మెరుగైన పనితీరును అందిస్తుంది. 2.2 స్టోరేజ్ టెక్నాలజీ కారణంగా యాప్‌లు వేగంగా స్పందించే అవకాశం ఉంటుంది. కెమెరా ఫీచర్లు ఫొటోగ్రఫీ విషయానికి వస్తే ఈ మొబైల్‌లో 50 మెగాపిక్సెల్ సోనీ ఊ్-600 మెయిన్ రేర్ కెమెరాను అందించారు. దానికి లైట్ సెన్సర్‌ను యాడ్ చేశారు. సెల్ఫీలు, వీడియో కాలింగ్ కోసం ముందు భాగంలో 13మెగాపిక్సెల్ కెమెరాను అమర్చారు. వంటి ఫీచర్లు ఈ కెమెరాలు సపోర్ట్ చేయనున్నాయి. బ్యాటరీ మెయిన్ హైలైట్ ఇక ఈ్రాశీఝు 8 స్మార్ట్‌ఫోన్‌లో బ్యాటరీనే మెయిన్ హైలైట్ అని చెప్పొచ్చు. 8000ఎ్ాష్ట్ర సామర్థ్యం గల భారీ బ్యాటరీ, 45ఔ ఫాస్ట్ చార్జింగ్‌కు మద్దతు ఉండటంతో తక్కువ సమయంలోనే ఫుల్ చార్జి చేసుకోవచ్చు. దీన్ని ఒక్కసారి చార్జి చస్తే 39 గంటలపైగా కాలింగ్, దాదాపు 18 గంటల వీడియో ప్లే బ్యాక్, 1100 గంటలకు పైగా స్టాండ్ బై సమయం అందుతుందని టెక్నో కంపెనీ పేర్కొంది. అదనంగా ఈ మొబైల్‌లో 64 డస్ట్, స్ప్లాష్ రెసిస్టెన్స్ రేటింగ్‌తో పాటు మిలటరీ గ్రేడ్ ధృవీకరణ కూడా లభించింది. ఇక గేమింగ్ సమయంలో వేడిని కంట్రోల్ చేసేందుకు 14,869 చదరపు మిల్లీమీటర్ల కూలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ మొబైల్ ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఎఱూా16 ఆపరేటింగ్ సిస్టమ్‌పై పనిచేస్తుంది.

## గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తకర వాతావరణం




ఇరాన్‌పై అమెరికా దాడులతో పశ్చిమాసియా సంక్షోభం తీవ్రం. దేశీయ మార్కెట్‌లో మరోమారు పెట్రో వడ్డనలకు అవకాశం అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చింది. దాదాపు మూడున్నర నెలలుగా (ఈ ఏడాది ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైంది) సాగుతున్న ఈ పోరు.. ఇప్పుడప్పుడే ఆగే అవకాశాలు కనిపించడం లేదు. ఆ మధ్య శాంతి కోసం చర్చలు, కాల్పుల విరమణ ఒప్పందం అంటూ తగ్గిన ఇరు వర్గాలు.. మళ్లీ దాడులు, ప్రతిదాడులకు తెగబడుతున్నాయి. తాజాగా ఇరాన్‌పై అమెరికా మిస్సైళ్ల వర్షం కురిపించింది. దీంతో ఇరాన్ సైతం కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లతో విరుచుకుపడింది. అంతేగాక హోర్ముజ్ జలసంధిని మూసేసింది. ఫలితంగా ఇప్పుడున్న పరిస్థితులనుబట్టి త్వరలోనే బ్యారెల్ ముడి చమురు ధర 150 నుంచి 200 డాలర్లకు చేరగలదన్న అంచనాలు జోరుగా వినిపిస్తున్నాయి.బ్యారెల్ 150-200 డాలర్లకు.. గ్లోబల్ మార్కెట్‌లో మళ్లీ ముడి చమురు ధరలు పైపైకి అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చింది. దాదాపు మూడున్నర నెలలుగా (ఈ ఏడాది ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైంది) సాగుతున్న ఈ పోరు.. ఇప్పుడప్పుడే ఆగే అవకాశాలు కనిపించడం లేదు. ఆ మధ్య శాంతి కోసం చర్చలు, కాల్పుల విరమణ ఒప్పందం అంటూ తగ్గిన ఇరు వర్గాలు.. మళ్లీ దాడులు, ప్రతిదాడులకు తెగబడుతున్నాయి.

## రిక్రూట్‌మెంట్లలో పీఎస్‌బీల దూకుడు



2025-26లో 13 వేల మందిని నియమించుకున్న బ్యాంకులు ఉద్యోగ నియామకాల్లో ప్రభుత్వరంగ బ్యాంకులు ముందువరుసలో నిలిచాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది ప్రభుత్వరంగ బ్యాంకులు మొత్తంగా 13,223 మందిని రిక్రూట్ చేసుకున్నాయి. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 6.28 లక్షలకు చేరుకోగా, అత్యధిక మంది బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)లో ఉన్నారు. 2024-25 నాటికి 6,14,980 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా..ఆ తర్వాత ఏడాదికి 6,28,203కి చేరుకున్నట్టు బ్యాంకింగ్ వార్షిక నివేదికలో వెల్లడైంది.ఉద్యోగ నియామకాల్లో ప్రభుత్వరంగ బ్యాంకులు ముందువరుసలో నిలిచాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది ప్రభుత్వరంగ బ్యాంకులు మొత్తంగా 13,223 మందిని రిక్రూట్ చేసుకున్నాయి. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 6.28 లక్షలకు చేరుకోగా, అత్యధిక మంది బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)లో ఉన్నారు. మొత్తం 12 ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఎనిమిదింటిలో ఎస్బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలు ఉన్నాయి. మిగతా నాలుగింటిలో పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులు ఇప్పటి వరకు తమ వార్షిక నివేదికను విడుదల చేయలేదు.

# ఆలియా భట్‌పై పేయిడ్ ట్రోలింగ్



షాహిద్ కపూర్ కీలక వ్యాఖ్యలు కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న అనంతరం బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్‌పై సోషల్ మీడియాలో భారీగా ట్రోల్స్ వచ్చిన సంగతి తెలిసిందే. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న అనంతరం బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్‌పై సోషల్ మీడియాలో భారీగా ట్రోల్స్ వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ నెగెటివ్ ట్రోల్స్ వెనుక ఒక పేయిడ్ పీఆర్ క్యాంపెయిన్ ఉందంటూ ప్రముఖ జర్నలిస్ట్ అనుపమ చోప్రా సంచలన ఆరోపణలు చేశారు. అయితే దీనిపై బాలీవుడ్ హీరో షాహిద్ కపూర్ ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికరంగా స్పందించారు. ఈ ఆరోపణలపై నేరుగా వ్యాఖ్యానించకుండా, చిత్ర పరిశ్రమలో ఉండే అభద్రతాభావం, అవగాహనల గురించి ఆయన మాట్లాడారు. తాను స్వయంగా చూడనిదే, ఆ గదిలో లేనిదే ఎవరు చెప్పినా నమ్మనని షాహిద్ స్పష్టం చేశారు. వినే ప్రతి విషయాన్ని ఒకటికి రెండుసార్లు ఆలోచించి నమ్మడం వల్ల ఇతరులు సృష్టించే కథనాల ప్రభావానికి లోనుకాకుండా ఉండొచ్చని ఆయన చెప్పారు. పబ్లిక్ ఫిగర్స్ ఇతరులు తమ అవగాహనను రూపొందించడానికి అనుమతిస్తే తారుమారు అవ్వడానికి గురవుతారని, కాబట్టి ప్రభావవంతమైన స్థానాల్లో ఉన్నవారు ధృవీకరణ లేకుండా సమాచారాన్ని అంగీకరించడంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. మరోవైపు ఇమేజ్, పబ్లిక్ ప్రెజర్ గురించి షాహిద్ కపూర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రేక్షకులు చాలా స్మార్ట్ అయ్యారని, ఎవరైనా కావాలని ఒక ఇమేజ్ క్రియేట్ చేసుకోవాలని చూస్తే ఈజీగా కనిపెట్టేస్తున్నారని అన్నారు. స్క్రీన్ పైన, బయట నిజాయితీగా ఉండే నటీనటులనే జనాలు ఎక్కువగా ఇష్టపడుతున్నారని చెప్పారు. ఒకప్పుడు సెలబ్రిటీల గురించి జనాలు ఏమనుకోవాలో పిఆర్ టీమ్స్ కంట్రోల్ చేసేవని, కానీ ఇప్పుడు ఆ రోజులు పోయాయని అన్నారు. అందుకే ఇప్పుడు నటులకు నిజాయితీ అనేది చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.

# నాగ్ 'సోగ్గాడే' సీక్వెల్ వాయిదా




కింగ్ అక్కినేని నాగార్జున ప్రతిష్టాత్మక 100వ చిత్రాన్ని 2027 సంక్రాంతి బరిలో దించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో గతంలో అన్నపూర్ణ స్టూడియోస్ ప్రకటించిన 'సోగ్గాడే చిన్ని నాయన' సీక్వెల్ ప్రస్తుతానికి పక్కకు వెళ్లినట్లు ఇండస్ట్రీ వర్గాల నుంచి సమాచారం. రా కార్తీక్ దర్శకత్వంలో క్రైమ్ అండ్ మనీ హీస్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న నాగ్ 100వ సినిమా షూటింగ్ ఇప్పటికే సగానికి పైగా పూర్తయింది. ఈ ఏడాది ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు 'జైలర్ 2', 'విశ్వంభర', 'స్వయంభు' వంటి భారీ పాన్-ఇండియా చిత్రాలు విడుదలకు క్యూ కట్టడంతో, వాటితో పోటీ పడకుండా నేరుగా సంక్రాంతి సీజన్‌లో రావడమే మంచిదని నాగార్జున భావిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో చాలా కాలం తర్వాత ఈ చిత్రంలో నాగార్జున సరసన టబు నటిస్తుండగా, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ట్రాక్‌లోకి కింగ్ 100వ చిత్రం కింగ్ అక్కినేని నాగార్జున ప్రతిష్టాత్మక 100వ చిత్రాన్ని 2027 సంక్రాంతి బరిలో దించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు 'జైలర్ 2', 'విశ్వంభర', 'స్వయంభు' వంటి భారీ పాన్-ఇండియా చిత్రాలు విడుదలకు క్యూ కట్టడంతో, వాటితో పోటీ పడకుండా నేరుగా సంక్రాంతి సీజన్‌లో రావడమే మంచిదని నాగార్జున భావిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో చాలా కాలం తర్వాత ఈ చిత్రంలో నాగార్జున సరసన టబు నటిస్తుండగా, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు 'జైలర్ 2', 'విశ్వంభర', 'స్వయంభు' వంటి భారీ పాన్-ఇండియా చిత్రాలు విడుదలకు ఈ ఏడాది ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు 'జైలర్ 2', 'విశ్వంభర', 'స్వయంభు' వంటి భారీ పాన్-ఇండియా చిత్రాలు విడుదలకు క్యూ కట్టడంతో, వాటితో పోటీ పడకుండా నేరుగా సంక్రాంతి సీజన్‌లో రావడమే మంచిదని నాగార్జున భావిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో చాలా కాలం తర్వాత ఈ చిత్రంలో నాగార్జున సరసన టబు నటిస్తుండగా, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. యంగ్ డైరెక్టర్ అయినప్పటికీ రా కార్తీక్ ఈ పీరియాడిక్ కథను, నాగార్జున విభిన్న షేడ్స్ లుక్‌ను అద్భుతంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో నాగ్ లుక్ కోసం 'డీ-ఏజింగ్' టెక్నాలజీని కూడా వాడుతున్నారట. దసరా కానుకగా ఈ సినిమా ఫస్ట్ టీజర్ వచ్చే అవకాశం ఉంది.

# 'అప్పలసూరి'కి రావాల్సిన గుర్తింపు రాలేదు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ సినిమాలో రామ్ చరణ్ నటనతో పాటు పలువురు నటీనటుల పాత్రలు కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సీనియర్ నటుడు జగపతిబాబు పోషించిన 'అప్పలసూరి' పాత్ర సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. గ్రామీణ నేపథ్యంలో సాగిన ఈ కథలో ఆయన పూర్తిగా పాత్రలో ఒదిగిపోయి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. సినిమా విజయానంతరం జగపతిబాబు, దర్శకుడు బుచ్చిబాబు సన కలిసి పాల్గొన్న ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ పాత్రకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీలో గుర్తింపు, నటనకు లభించే ప్రశంసలపై జగపతిబాబు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అప్పలసూరి పాత్రకు థియేటర్లలో వస్తున్న స్పందన గురించి మాట్లాడుతూ జగపతిబాబు ఓ ఆసక్తికర సంఘటనను వెల్లడించారు. సినిమా విడుదలైన తర్వాత ఇండస్ట్రీకి చెందిన ఓ ప్రముఖ దర్శకుడు తనకు ఫోన్ చేసి మాట్లాడారని చెప్పారు. "ఈ పాత్రను ఏదైనా మలయాళం, తమిళం లేదా హిందీ నటుడు చేసి ఉంటే, అందరూ అతడిని ఆకాశానికి ఎత్తేసేవారు. జగపతిబాబు ఆసక్తికర వ్యాఖ్యలు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ సినిమాలో రామ్ చరణ్ నటనతో పాటు పలువురు నటీనటుల పాత్రలు కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సీనియర్ నటుడు జగపతిబాబు పోషించిన 'అప్పలసూరి' పాత్ర సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. కానీ మీరు తెలుగు నటుడు కావడం మీ బ్యాడ్ లక్. మనవాళ్లు మన ప్రతిభను అంతగా సెలబ్రేట్ చేయరు" అని ఆ దర్శకుడు తనతో అన్నట్లు జగపతిబాబు వెల్లడించారు. అలాగే, గతంలో 'అరవింద సమేత'లో చేసిన వీరారెడ్డి పాత్ర తర్వాత నటుడిగా తనకు అత్యంత సంతృప్తిని ఇచ్చిన పాత్ర 'అప్పలసూరి'దేనని ఆయన పేర్కొన్నారు. ఈ పాత్ర కోసం తాను ఎంతో కష్టపడ్డానని, ఫలితం కూడా అద్భుతంగా వచ్చిందని తెలిపారు. మరోవైపు దర్శకుడు బుచ్చిబాబు ఈ పాత్ర ఎంపిక వెనుక ఉన్న ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 'పెద్ది' సినిమాలో హీరో తర్వాత అత్యంత కీలకమైన పాత్ర అప్పలసూరిదేనని, ప్రేక్షకుల్లో ఆ పాత్రపై జాలి, అనుబంధం కలగాలని తాను కోరుకున్నానని చెప్పారు. అయితే జగపతిబాబు ఎప్పుడూ రాయల్ లుక్‌లో, స్టైలిష్ పాత్రల్లో కనిపిస్తారని, అందువల్ల గ్రామీణ వ్యక్తి పాత్రలో ఆయనను ప్రేక్షకులు అంగీకరిస్తారా లేదా అన్న సందేహం మొదట్లో తనకు వచ్చిందని బుచ్చిబాబు తెలిపారు. తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో స్టోరీ బోర్డు రూపొందించి పరిశీలించగా, ఈ పాత్రకు జగపతిబాబు కంటే సరైన ఎంపిక మరొకరు లేరని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అయితే ఈ పాత్రకు తాను ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదనే అసంతృప్తిని కూడా జగపతిబాబు వ్యక్తం చేయడం చర్చనీయాంశం అయింది.దర్శకుడు తనతో అన్నట్లు జగపతిబాబు వెల్లడించారు. అలాగే, గతంలో 'అరవింద సమేత'లో చేసిన వీరారెడ్డి పాత్ర తర్వాత నటుడిగా తనకు అత్యంత సంతృప్తిని ఇచ్చిన పాత్ర 'అప్పలసూరి'దేనని ఆయన పేర్కొన్నారు. ఈ పాత్ర కోసం తాను ఎంతో కష్టపడ్డానని, ఫలితం కూడా అద్భుతంగా వచ్చిందని తెలిపారు. మరోవైపు దర్శకుడు బుచ్చిబాబు ఈ పాత్ర ఎంపిక వెనుక ఉన్న ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 'పెద్ది' సినిమాలో హీరో తర్వాత అత్యంత కీలకమైన పాత్ర అప్పలసూరిదేనని, ప్రేక్షకుల్లో ఆ పాత్రపై జాలి, అనుబంధం కలగాలని తాను కోరుకున్నానని చెప్పారు. అయితే జగపతిబాబు ఎప్పుడూ రాయల్ లుక్‌లో, స్టైలిష్ పాత్రల్లో కనిపిస్తారని, అందువల్ల గ్రామీణ వ్యక్తి పాత్రలో ఆయనను ప్రేక్షకులు అంగీకరిస్తారా లేదా అన్న సందేహం మొదట్లో తనకు వచ్చిందని బుచ్చిబాబు తెలిపారు. తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో స్టోరీ బోర్డు రూపొందించి పరిశీలించగా, ఈ పాత్రకు జగపతిబాబు కంటే సరైన ఎంపిక మరొకరు లేరని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అయితే ఈ పాత్రకు తాను ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదనే అసంతృప్తిని కూడా జగపతిబాబు వ్యక్తం చేయడం చర్చనీయాంశం అయింది. దర్శకుడు తనతో అన్నట్లు జగపతిబాబు వెల్లడించారు. అలాగే, గతంలో 'అరవింద సమేత'లో చేసిన వీరారెడ్డి పాత్ర తర్వాత నటుడిగా తనకు అత్యంత సంతృప్తిని ఇచ్చిన పాత్ర 'అప్పలసూరి'దేనని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ వ్యక్తి పాత్రలో ఆయనను ప్రేక్షకులు అంగీకరిస్తారా లేదా అన్న సందేహం మొదట్లో తనకు వచ్చిందని బుచ్చిబాబు తెలిపారు.ఈ పాత్ర కోసం తాను ఎంతో కష్టపడ్డానని, ఫలితం కూడా అద్భుతంగా వచ్చిందని తెలిపారు. మరోవైపు దర్శకుడు బుచ్చిబాబు ఈ పాత్ర ఎంపిక వెనుక ఉన్న ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 'పెద్ది' సినిమాలో హీరో తర్వాత అత్యంత కీలకమైన పాత్ర అప్పలసూరిదేనని, ప్రేక్షకుల్లో ఆ పాత్రపై జాలి, అనుబంధం కలగాలని తాను కోరుకున్నానని చెప్పారు. అయితే జగపతిబాబు ఎప్పుడూ రాయల్ లుక్‌లో, స్టైలిష్ పాత్రల్లో కనిపిస్తారని, అందువల్ల గ్రామీణ వ్యక్తి పాత్రలో ఆయనను ప్రేక్షకులు అంగీకరిస్తారా లేదా అన్న సందేహం మొదట్లో తనకు వచ్చిందని బుచ్చిబాబు తెలిపారు. తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో స్టోరీ బోర్డు రూపొందించి పరిశీలించగా, ఈ పాత్రకు జగపతిబాబు కంటే సరైన ఎంపిక మరొకరు లేరని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అయితే ఈ పాత్రకు తాను ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదనే అసంతృప్తిని కూడా జగపతిబాబు వ్యక్తం చేయడం చర్చనీయాంశం అయింది.

# 2పై క్రేజీ అప్డేట్ -జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో భారీ సీక్వెల్ ప్లాన్!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కెరీర్‌లో అత్యంత స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకుంది. గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి పవన్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచింది. ముఖ్యంగా పవన్‌ను పూర్తి స్థాయి స్టైలిష్ డాన్ అవతారంలో చూపించిన దర్శకుడు సుజీత్ ప్రశంసలు అందుకున్నారు. సినిమా విడుదల సమయంలోనే చిత్రబృందం ను అధికారికంగా ప్రకటించింది. దీంతో సీక్వెల్ ఎప్పుడు ప్రారంభమవుతుంది? కథ ఎలా ఉండబోతోంది? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అయితే పవన్ కళ్యాణ్ రాజకీయ బాధ్యతలతో బిజీ కావడం, మరోవైపు సుజీత్ కొత్త ప్రాజెక్టులతో ముందుకు వెళ్లడం వల్ల త్వరలో ఉండకపోవచ్చనే ప్రచారం కూడా జరిగింది. అయితే తాజాగా పవన్ కళ్యాణ్‌కు చెందిన నిర్మాణ సంస్థ అధికారిక సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్ట్ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. "మాట ఇచ్చినట్లే ఆయన చేస్తారు. సమయం ఎప్పుడనేది ఆయనే చెబుతారు. సుజీత్ విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత దీనిపై చర్చిద్దాం" అంటూ చేసిన ట్వీట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. దీంతో 'ప్రాజెక్ట్ ఆగిపోలేదని, సరైన సమయంలో పట్టాలెక్కే అవకాశాలు ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటికే సుజీత్ హీరో నానితో కొత్త సినిమా ప్రకటించినప్పటికీ, ఆ సినిమా పూర్తయిన వెంటనే ఫోకస్ పెట్టే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పవన్ కూడా తన రాజకీయ షెడ్యూల్‌కు అనుగుణంగా సినిమా కోసం సమయం కేటాయించే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది.ఇక కథ విషయానికి వస్తే, జపాన్ నుంచి ముంబైకి వచ్చిన ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా పవన్ కళ్యాణ్ కనిపించారు. ముంబై అండర్‌వరల్డ్‌ను శాసించే స్థాయికి ఎదిగిన అతను కొన్నేళ్ల పాటు అదృశ్యమై తిరిగి రావడం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సినిమా ముగింపులో జపాన్‌లో అతని గతం గురించి హింట్ ఇవ్వడం ద్వారా దర్శకుడు సీక్వెల్‌కు బలమైన లీడ్ వదిలారు.అయితే ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సాధారణ సీక్వెల్ కాకుండా ప్రీక్వెల్‌గా తెరకెక్కే అవకాశాలు ఉన్నాయని గతంలో సుజీత్ సూచించారు. ప్రపంచాన్ని విస్తరించేందుకు విడుదల చేసిన ప్రత్యేక పుస్తకంలోని కథాంశాలను ఆధారంగా తీసుకుని రెండో భాగాన్ని రూపొందించే ఆలోచన ఉందని తెలుస్తోంది. సుజీత్ హీరో నానితో కొత్త సినిమా ప్రకటించినప్పటికీ, ఆ సినిమా పూర్తయిన వెంటనే ఫోకస్ పెట్టే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పవన్ కూడా తన రాజకీయ షెడ్యూల్‌కు అనుగుణంగా సినిమా కోసం సమయం కేటాయించే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది.ఇక కథ విషయానికి వస్తే, జపాన్ నుంచి ముంబైకి వచ్చిన ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా పవన్ కళ్యాణ్ కనిపించారు. ముంబై అండర్‌వరల్డ్‌ను శాసించే స్థాయికి ఎదిగిన అతను కొన్నేళ్ల పాటు అదృశ్యమై తిరిగి రావడం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సినిమా ముగింపులో జపాన్‌లో అతని గతం గురించి హింట్ ఇవ్వడం ద్వారా దర్శకుడు సీక్వెల్‌కు బలమైన లీడ్ వదిలారు.అయితే ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సాధారణ సీక్వెల్‌ఆ కథ ప్రకారం, సుబాస్ చంద్రబోస్ జపాన్‌కు వెళ్లిన కాలానికి సంబంధించిన నేపథ్యాన్ని సినిమాలో చూపించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. జపాన్‌లో జరిగిన సంఘటనలు, ఓజాస్ గంభీర తండ్రి కథ, అతని మరణానికి కారణమైన శత్రువులపై కుమారుడు చేసిన ప్రతీకారం ప్రధాన కథాంశంగా ఉండొచ్చని సినీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449